ప్రజాశక్తి

సోమవారం 13 జనవరి 2025

8 పేజీలు





ఎన్‌టిఆర్

కృష్ణా

బరిలో కోఢీ

- ఆంక్షలెన్ని ఉన్నా జోరుగా నిర్వహణ
- పోలీసుల ఆదేశాలు బేఖాతరు
- ఘంటసాలలో ఆదివారం రాత్రి నుంచే ప్రారంభం
- ఈ ఏడాది ఇండోనేషియా తరహాలో కోడి పందేలు



ఘంటసాల మండలం కొడాలిలో ఆదివారం రాత్రి జరుగుతున్న కోడి పందేలు



రామవరప్పాడులో ఏర్పాటు చేసిన బరులు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

పోలీస్ హెచ్చరికలను పందెంరాయుళ్లు బేఖాతరు చేశారు. ఉమ్మడి కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఎక్కడబడితే అక్కడ కోడి పందేలు, జూద క్రీడలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ రెండు నుంచి నాలుగు చోట్ల కోడి పెందెం బరులు, పేకాట కోసులకు ఏర్పాట్లు చేశారు. సోషల్ మీడియాలోనూ నిర్వాహకులు పందెం రాయుళ్లకు, జూదలరులకు ఆయా ప్రాంతాల్లో కల్పించిన సౌకర్యాలపై ప్రచారం చేస్తున్నారు. ఈ ఏడాది కొత్తగా ఇండోనేషియా తరహాలో రింగు కోడిపందేలు నిర్వహిస్తామని నిర్వాహకులు ప్రచారం మొదలెట్టారు. ఆదివారం రాత్రి (మిగతా 2లో)

అసంపూర్తిగా రోడ్లు



- కృష్ణాజిల్లాలో మొత్తం సిసి రోడ్లు 1932
- ప్రారంభంకానివి 71
- అసంపూర్తిగా ఉన్నవి 619
- బిటి రోడ్లలో సగం మాత్రమే పూర్తి
- ఇతర రోడ్ల పనుల్లో పూర్తిగా వెనుకబాటు

ప్రజాశక్తి-కృష్ణా ప్రతినిధి

'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్ఆర్ఇజిఎస్) మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు, బిటి రోడ్లు, ఇతర అభివృద్ధి పనులను రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున చేపట్టాం. మొదటి దశలో చేపట్టిన పనులు పూర్తి చేసి 2015 జనవరి 14 సంక్రాంతి పండుగ చేసుకుందామని' 2024 అక్టోబర్ 15వ తేదీన కంకిపాడులో పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాలు ప్రారంభ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చెప్పిన మాటలు పూర్తి స్థాయిలో ఆచరణకు నోచుకోలేదు. కృష్ణాజిల్లాలో పూర్తయిన పనులను పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లం అవుతుంది. ప్రణాళిక లోపం, నియోజకవర్గ స్థాయి నేతల సిఫార్సుల్లో జాప్యం జరగడంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో పనులు మొదలవ్వలేదు.

బిటి రోడ్లలో 45 శాతమే

పల్లె పండుగ కార్యక్రమంలో కృష్ణాజిల్లా వ్యాప్తంగా రూ.143.7 కోట్లతో 1932 సిమెంట్ రోడ్లను 222 కిలోమీటర్లు నిర్మించాలి. అయితే 1861 రోడ్ల నిర్మాణ పనులు మాత్రమే ప్రారంభించారు. 154 కిలోమీటర్ల మేర 1314 రోడ్ల నిర్మాణం పూర్తయింది. 71 పనులు అసలు ప్రారంభమే కాలేదు. 44 పనుల్లో (మిగతా 2లో)





బాలలకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేస్తున్న పుస్తక మహోత్సవం నిర్వాహకులు, ప్రజాశక్తి బుక్‌స్టాల్ వద్ద పుస్తక ప్రియులు

ముగిసిన పుస్తక మహోత్సవం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో నిర్వహించిన పుస్తక మహోత్సవం ఆదివారం ఘనంగా ముగిసింది. 11 రోజుల పాటు పుస్తక ప్రియులు పుస్తకాల కోసం రావడంతో పుస్తక మహోత్సవం కళకళలాడింది. తొలిసారిగా ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరగడంతో నిర్వాహకులు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశారు. పుస్తక ప్రియులకు ఎటువంటి ఇబ్బంది లేదుండా చక్కటి ఏర్పాట్లు చేయడంతో పుస్తక మహోత్సవం విజయవంతంగా జరిగింది. గతేడాది కన్నా ఈ ఏడాది పుస్తక మహోత్సవంకు సందర్శకుల సంఖ్య పెరిగింది. ఈ పుస్తక మహోత్సవానికి దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో ప్రచురణ సంస్థలు పాల్గొన్నాయి. తొలిరోజు రెండో తేదీన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుస్తక మహోత్సవాన్ని ప్రారంభించారు. రెండో సారి కూడా ఆయన సందర్శించి పలు పుస్తకాలను కొనుగోలు చేశారు. పుస్తక మహోత్సవానికి కళాశాల యువతతో పాటు మహిళలు, విద్యార్థులు, నగర ప్రముఖులు కూడా పాల్గొన్నారు. ప్రతి రోజు సాహితీ కార్యక్రమాలతో పాటు పుస్తకావిష్కరణలు, సదస్సులు జరిగాయి. చివరి రోజు ఆదివారం కావడంతో మధ్యానం 12 గంటల నుండే సందర్శకులు తరలివచ్చారు.

35వ విజయవాడ పుస్తక మహోత్సవం ఆఖరి రోజు ఆదివారం రామోజీరావు సాహిత్యవేదికపై నిర్వహించిన ముగింపు సభలో ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ వ్యక్తులలో మానవత్వాన్ని పెంచేందుకూ, సర్వమానవ సౌభ్రాతత్వాన్ని పెంపొందించేందుకూ సాహిత్యం దోహదం చేస్తుందన్నారు. ప్రముఖులు జి.మాల్యాద్రి మాట్లాడుతూ కులమత రాజకీయ బేధాలు (మిగతా 2లో)

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

- 97 వేల హెక్టార్లలో రబీ పంటలు
- పంటలకు ఈక్రాప్ నమోదు
- కృష్ణాజిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

2024-25 రబీ సీజన్‌లో కృష్ణాజిల్లాలో 97,389 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగయ్యాయని కృష్ణాజిల్లా వ్యవసాయ అధికారి ఎన్.పద్మావతి చెప్పారు. అత్యధిక విస్తీర్ణంలో రైతులు అపరాలు సాగు చేస్తున్నారని, వ్యవసాయ అధికారుల సూచనలను పరిగణలోకి తీసుకుని మేలైన యాజమాన్య పద్ధతులు అనుసరించడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. రబీలో సాగు చేసిన పంటలను ఈక్రాప్ నమోదు చేస్తున్నట్లు వివరించారు. భారీ వరదలకు



ముంపుకు గురైన పంటలకు పరిహారం చెల్లింపులో అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై విచారణ జరుగుతోందని అన్నారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పద్మావతి రబీ పంటల సాగు గురించి వివరించారు.

ప్రశ్న: రబీ పంటలు ఎంత సాగయ్యాయి?

జవాబు: రబీలో ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేసుకోవాలని ప్రభుత్వం (మిగతా 2లో)





ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ఫాదర్లు

నేటి నుంచి జోసఫ్ తంబి ఉత్సవాలు

వార్త 5లో

మొదటిపేజీ తరువాయి

అసంపూర్తిగా రోడ్లు

జాప్యం జరుగుతోంది. రూ.15.85 కోట్లతో 36 బిటి రోడ్ల నిర్మాణం చేపట్టారు. రూ.5 కోట్ల విలువైన 15 రోడ్లు మాత్రమే నిర్మించారు. రూ.5.1 కోట్లతో చేపట్టిన కాంపౌండ్ వాల్స్, షెల్టర్ల నిర్మాణం తదితర 77 పనులు చేయాలి. రూ.70 లక్షల విలువైన ఎనిమిది పనులు మాత్రమే పూర్తయ్యాయి. క్షేత్రస్థాయిలో 41 ప్రారంభమయ్యాయి. మరో 36 పనులు ప్రారంభంకాలేదు.

పనుల కేటాయింపులో నిర్లక్ష్యం

ఎన్‌ఆర్ఇజిఎస్ మెటీరియల్ కాంపోనెంట్ పనులకు టెండర్లను ఆహ్వానించారు. ఎంపిడిఓ కార్యాలయంలో రిజిస్టర్ అయిన వెండర్లకు పనులను కేటాయిస్తారు. వెండర్ల నియామకంలో పంచాయతీ ఆమోదం ఉండాలి. నియోజకవర్గ ప్రజాప్రతినిధులు తమకు అనుచరులకు లేదా అనుకూలమైన వారికి పనుల కేటాయింపు కోసం సిఫార్సు చేశారు. కొన్ని ప్రాంతాల్లో పనుల కేటాయింపుల్లో అధికార పార్టీ కార్యకర్తల మధ్య విబేధాలు చోటు చేసుకున్నాయి. ఈ వివాదాలు ముడిపడకపోవడంతో ప్రజాప్రతినిధులు పనుల కేటాయింపుపై వెండర్లను సూచించలేదు. దీంతో ఆయా పనులు నిలిచిపోయాయి. మరికొన్ని చోట్ల వెండర్లను ఆలస్యంగా సిఫార్సు చేయడంతో పనుల్లో జాప్యం జరిగింది.

బరిలో కోడీ

కొడాలిలో ఈ తరహా పోటీలను అధికార పార్టీ నేత ఒకరు ఘనంగా ప్రారంభించారు. ఈ నేపథ్యంలో వీటి నిర్వహణకు తెరవెనక అధికార పార్టీ నేతల సిఫార్సులు ఉండటంతో పోలీసులు మొక్కుబడి చర్యలు తీసుకుంటున్నారనే చర్చ జరుగుతోంది.

ఘంటసాల మండలం కొడాలి సెంటర్ సమీపంలో ఏర్పాటు చేసిన కోడిపందెం బరిని, పేకాట కోసులను ఆదివారం ఉదయం పోలీసులు తొలగించారు. రాత్రి ఎనిమిది గంటలకు నిర్వాహకులు తిరిగి పునరుద్ధరించారు. అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు లాంఛనంగా రిబ్బను కత్తిరించి కోడి పందేలను ప్రారంభించారు. ఫ్లడ్‌లైట్ల వెలుగులో బరిలో ఒకే సారి కాళ్లకు కత్తులు కట్టిన పది పుంజులను పోటీకి పెట్టారు. రింగు పందెంలో చివరికి నిలిచిన పుంజుకు రూ.లక్ష బహుమతి ప్రకటించారు. ఎనిమిది కోళ్లు మృతిచెందాయి. రెండు కోళ్ల యజమానులు ఒక్కొక్కరు రూ.50 వేలు చొప్పున లక్ష పంచుకున్నారు. బరి నిర్వహకులు రింగు పోటీకి పెట్టిన ఒక్కో కోడి యజమాని నుంచి రూ.10 వేలు బరి స్వహకులు తీసుకున్నారు. ఈ మండలంలోనే లంకపల్లి వద్ద జాతీయ రహదారి 216 పక్కన సన్‌ఫ్లవర్ ఇంజనీరింగ్ కాలేజీ వెనుక ప్రాంతంలో బరులు సిద్ధం చేశారు. మండల కేంద్రం మోపిదేవి టోల్‌గేట్ సమీపంలో శనివారం పోలీసులు తొలగించిన కోడి పందేలు బరిని ఆదివారం పునరుద్ధరించారు. పెనమలూరు నియోజకవర్గంలో కంకిపాడు చైతన్య టెక్నో స్కూల్ వద్ద కోడి పందేలు, జూద క్రీడలకు భారీ ఏర్పాట్లు చేశారు. ఇదే తరహాలో ప్రతి నియోజకవర్గంలోనూ రెండు నుంచి నాలుగు ప్రాంతాలకు తక్కువ కాకుండా కోడి పందెంబరులు, జూద క్రీడలకు కోసులకు ఏర్పాట్లు చేశారు. ఆయా ప్రాంతాల్లో పందెం రాయుళ్లు, జూదరులకు సోషల్ మీడియా గ్రూపుల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.

నిర్వాహకులకు కాసులు... జూదరులకు అప్పులు

సంక్రాంతి సంప్రదాయం ముసుగులో నిర్వహించే కోడి పందేలు, పేకాట కోసుల్లో నిర్వహకులకు కాసుల పంట పండిస్తాయి. ఈ నేపథ్యంలోనే లాభాల వేటలో నిర్వాహకులు ప్రతి ఏటా నిర్వహిస్తున్నారు నిర్వహకుల లాభాల్లో కొందరు ప్రజాప్రతినిధులు ఈ ఏడాది వాటలు అడిగారనే ఆరోపణలు వినవస్తున్నాయి. సుదూర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తూ పండుగకు ఆటవిడుపుగా చుట్టపు చూపుగా స్వగ్రామాలకు వచ్చే అనేక మంది కోడి పందేలు, జూద క్రీడల్లో భారీ మొత్తంలో నగదు కోల్పోతున్నారు.



కొడాలిలో ధ్వంసం చేసిన బరులు

వివేకానంద స్ఫూర్తితో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ప్రజాశక్తి-విజయవాడ: స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని, వాటిని చేరుకునేందుకు శ్రమించాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఆదివారం స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజనోత్సవం సందర్భంగా విజయవాడలోని రాఘవయ్య పార్కు వద్ద జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు. అధికారులతో కలిసి వివేకానంద విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం జాతీయ యువజన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సౌశీల్యం, నిరంతర అధ్యయనంతో స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకొని యువత తమను తాము తీర్చిదిద్దుకుంటూ ముందడుగు వేయాలని సూచించారు. ఆయన సందేశం యువత విజయానికి సరైన మార్గనిర్దేశనమని పేర్కొన్నారు. ఏటా ఆయన జయంతిని జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకుంటున్నామని.. ఈ కార్యక్రమంలో పాల్గొనడం చాలా ఆనందాన్నిస్తోందన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని యువత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, రాష్ట్రం, దేశాభివృద్ధిలో కీలక భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన సంక్షేమ శాఖ అధికారి యు.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతితో ఆనందం వెల్లివిరియాలి

సంక్రాంతి పండుగ ప్రజల జీవితాల్లో అద్భుత ప్రారంభాలకు నాంది పలికి ప్రతీ కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భోగభాగ్యాలతో భోగిని, సిరి సంపదలతో సంక్రాంతిని, కనువిందుగా కనుమని జరుపుకోవాలని పేర్కొన్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

విజయవాడ: గొల్లపూడిలోని శ్రీ పోసాని నరసింహారావు చౌదరి ఉన్నత పాఠశాలలో 50 సంవత్సరాల క్రితం విద్యనభ్యసించిన 1975 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు స్వర్ణోత్సవ సమ్మేళనాన్ని ఆదివారం పాఠశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉల్లాసంగా ఆటపాటలతో గడిపారు. నాడు తమకు బోధించిన ఉపాధ్యాయులు హనుమంతరావు, వేంకటేశ్వర్లు, రామకోటేశ్వరరావులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మార్కెటింగ్ యార్డ్ మాజీ చైర్మన్ జాలిపర్తి గోపాలకృష్ణ, గాంధీ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ వేమూరి వెంకటరావు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని సుబ్బారావు, సుధీర్, శ్రీనివాస్, శివరామకృష్ణ, మురళి నిర్వహించారు.

కొనసాగుతున్న వాహనాల రద్దీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని చిల్లకల్లు గ్రామ సమీపంలోని కొంగర మల్లయ్య గట్టు టోల్ గేట్ వద్ద సంక్రాంతి పండుగను పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్రం నుండి వచ్చే వాహనాల రద్దీ కొనసాగుతుంది. ఆదివారం సెలవు రోజు కావడం, సంక్రాంతి సెలవులు నేపథ్యంలో తమ సొంత ఊర్లకు ప్రయాణికులు భారీ సంఖ్యలో కార్లలో రావడంతో రోడ్లు రద్దీతో కిక్కిరిసిపోయాయి. కార్ల రద్దీని దృష్టిలో పెట్టుకొని చిల్లకల్లు పోలీసులు, టోల్ గేట్ సిబ్బంది ట్రాఫిక్ ఎక్కువగా ఆగకుండా తగిన ఏర్పాట్లు చేశారు.

రేపు కేలండర్లు పంపిణీ

ప్రజాశక్తి-విజయవాడ: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని విజయవాడ ఎంజి రోడ్డులోని పైలెట్ సర్వీస్ స్టేషన్ (పెట్రోల్ బంక్) వినియోగదారులకు వారి ఫొటోలతో కూడిన కేలండర్లను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు పైలెట్ సర్వీస్ స్టేషన్ అధిపతి ఎం.వి.వి. సత్యనారాయణ, మేనేజర్ వెంకటప్పయ్య తెలిపారు. సుమారు 850 మంది వినియోగదారులు ఆదివారం వారి కుటుంబ సభ్యులతో వచ్చి ఫొటోలు దిగారని, ఆ ఫొటోలతో రూపొందించిన కేలండర్‌ను 14వ తేదీ పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. గత 11 సంవత్సరాలుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఛీఫ్ డివిజనల్ రిటైల్ హెడ్ ఎ.అనిల్‌కుమార్, ఎన్‌టిఆర్ జిల్లా సేల్స్ ఆఫీసర్ కె.వరప్రసాద్, నంద కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పుస్తక మహోత్సవం

లేకుండా ఐకమత్యంగా రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పుస్తక మహోత్సవం అధ్యక్షులు కె.లక్ష్మయ్య మాట్లాడుతూ సమాజంగా అభివృద్ధి చెందాలంటే పాఠశాల స్థాయిలో గ్రంథాలయాలను, విద్యార్థులలో పుస్తకాలు చదివే అలవాటునూ పెంచాలన్నారు.

విశ్రాంత ఐఎఎస్ అధికారి ఎండీ ఇంతియాజ్ మాట్లాడుతూ పుస్తకాలు మనుషులకు మంచి స్నేహితులన్నారు. ఈ సభలో పుస్తక మహోత్సవ సంఘం కార్యదర్శి మనోహర్ నాయుడు, గౌరవాధ్యక్షులు బెల్లపు బాబ్జీ, సభ్యులు జేపీ పబ్లికేషన్స్ ప్రసాద్, నవసాహితీ రవి, ఎమెస్కో లక్ష్మి, కార్యకర్తలు జనవిజ్ఞానవేదిక శ్రీనివాస్, గోళ్ల నారాయణరావు, ముంజులూరి కష్ణకుమారి, బాలాంత్రపు ప్రసూన సభలో పాల్గొన్నారు.

రతన్ టాటా ప్రతిభా వేదికపై బాలలకు నిర్వహించిన పోటీలలో విజేతలకు అతిథుల చేతుల మీదుగా సర్టిఫికెట్లు, బహుమతులు అందించారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

సూచించింది. ఖరీఫ్ వరి మాగాణుల్లో రబీలో రెండో పంటగా అత్యధిక విస్తీర్ణం 89,394 హెక్టార్లలో మినుము సాగు చేశారు. పెసర 2,376, మొక్కజొన్న 2,740, జొన్న 762, వేరుశనగ 153, నువ్వులు 43, పుగాకు 135, శనగ 11, ఉలవలు 6 హెక్టార్లలో సాగయ్యాయి. 1765 హెక్టార్లలో బోర్లు కింద దాళ్వా వరి సాగు చేశారు. స్వల్పంగా సాగయిన ఇతర పంటలను పరిగణలోకి తీసుకుంటే ఇప్పటి వరకు మొత్తం 97,389 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగయ్యాయి.

ప్రశ్న: ఈ క్రాప్ నమోదు, పంటల బీమా ప్రీమియం చెల్లింపు పూర్తయిందా?

జవాబు: రబీ పంటలకు రైతులు ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలి. ఈ క్రాప్ నమోదు మొదలైంది. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు ఈ క్రాప్ నమోదు పూర్తి చేస్తాం. డిసెంబర్ 15వ తేదీతో రబీ అపరాలకు బీమా ప్రీమియం చెల్లింపుకు గడువు ముగిసింది. వరికి మరో మూడు రోజుల్లో పూర్తవుతుంది. జనవరి 15వ తేదీ వరకు బీమా ప్రీమియం చెల్లింపునకు అవకాశం ఉంది.

ప్రశ్న: పంట నష్ట పరిహారం చెల్లింపులో అవినీతిపై చర్యలు తీసుకుంటున్నారా?

జవాబు: కృష్ణానది వరదలకు పంట నష్టపరిహారం చెల్లింపులో అక్రమాలు జరిగాయని తోట్లవల్లూరు నుంచి ఫిర్యాదు వచ్చింది. తోట్లవల్లూరు గ్రామంలో వివిధ పంటలు నష్టపోయిన 573 మంది రైతుల ఖాతాల్లో రూ.74.86 లక్షల పరిహారాన్ని ప్రభుత్వం జమచేసింది. దీనిపై వ్యవసాయ శాఖ అధికారులు క్షుణంగా విచారణ జరుపుతున్నారు. విచారణ పూర్తవ్వగానే ఉన్నతాధికారులకు పూర్తి నివేదిక ఇస్తాం. వారి సూచనలు మేరకు అక్రమాలు రుజువైతే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: అపరాల సాగులో సూచనలు చేస్తారా?

జవాబు: రబీలో అత్యధికంగా 89,394 హెక్టార్ల విస్తీర్ణంలో మినుము సాగు చేస్తున్నారు. ఈ జిల్లాలో వరి మాగాణుల్లో రెండో పంటగా అపరాలు సాగు చేస్తారు. మినుము పంటలో పొగాలు లద్దె పురుగు ఎక్కువగా కనిపిస్తోంది. వేప సంబంధమైన 1500 పిపిఎం గాడత ఉన్న మందులను ఎకరాకు లీటరు పిచికారి చేయడం ద్వారా ఈ పురుగులను నివారించ వచ్చు. పురుగు ఉధ్రుతి అధికంగా ఉన్నప్పుడు స్పైనోసాడ్, క్లోరాంట్రనిల్ ప్రోల్ మందుల్లో ఒకటి ఎకరాకు 60 మిల్లీ మీటర్లు పిచికారి చేయాలి. ఆయా సందార్భాల్లో ఎదురైయ్యే సస్యరక్షణ సమస్యలపై స్థానిక, మండల వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు పాటించి మెరుగైన దిగుబడులు సాధించ వచ్చు.

బహిరంగ ప్రకటన

మా క్లయింటు అయిన కనకమేడల పవన్ కుమార్ తండ్రి లేటు కనకమేడల వీర వరప్రసాదరావు ప్రస్తుతము నివాసం యు.ఎస్.ఎ. వారి తరుపున జి.పి.ఎ హెల్డార్ మరియు తల్లి గారైన కనకమేడల జ్యోతి గారు నివాసం డోర్ నెం: 3-15, పెనమలూరు, కృష్ణాజిల్లా వారి ద్వారా సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా....

మా క్లయింటు అయిన కనకమేడల పవన్ కుమార్ గారు ది.30-1-2020 తేదిన పటమట సబ్ రిజిష్టారు ఆఫీసులో రిజిష్టరు కాబడిన దస్తావేజు నెం: 749/2020 దస్తావేజు రీత్యా కృష్ణా జిల్లా పెనమలూరు మండలం, కానూరు గ్రామ పంచాయితీ లో చేరిన రీసర్వే నెం: 260రు దాఖలా ఎల్.పి. నెం: 7/2005 గా అప్రూవల్ కాబడిన ప్లాన్ దాఖలా ప్లాట్ నెం:20రు, చ.గ. 186.66 లు నివేశన స్థలం, సదరు స్థలము లోని ఆర్.సి.సి బిల్డింగ్‌ను యర్రంశెట్టి అమ్మాణి భర్త రమణారెడ్డి రామవర్పపాడు వారి నుండి క్రయం ను పొంది వారు ది.27-07-2015 తేదిన శ్రీ రామినేని శివరామ కృష్ణయ్య గారి నుండి క్రయం ను పొందిన అటువంటి క్రయ ఆస్థికి సంబంధించిన ఒరిజినల్ లింకు దస్తావేజు నెం: 4840/2015 (మా క్లయింటు యొక్క లింకు దస్తావేజు) సదరు లింకు ఒరిజనల్ దస్తావేజు మరియు బ్యాంకు పాస్‌బుక్, ఇతర కాగితాలు ఒక పాలీథీన్ కవరులో ఉంచి సదరు జ్యోతి గారు గొల్లపూడి లోని వారి చెల్లెలు గారి ఇంటి నుండి మైలురాయి సెంటర్‌కు జిరాక్స్ కొరకు వెళ్లుచుండగా మైలురాయి సెంటర్ లో డాక్యుమెంట్స్ గల కవరు జారీ పడిపోయినది. ఎంత వెదికిన దొరికి యుండలేదు. కావున ఎవరికైన సదరు ఒరిజనల్ లింకు డాక్యుమెంట్ గల కవరు దొరికినచో పైఅడ్రసు లో గల మా క్లయింటుకు గాని, లేదా దిగువన గల మా అడ్రసుకు గాని అందజేయగలరు. తెచ్చి ఇచ్చిన వారికి తగిన పారితోషికం ఇవ్వబడును. సదరు డాక్యుమెంట్స్ అన్యాధ ఉపయోగించిచో మా క్లయింటు తీసుకోను చట్టపరమైన చర్యలకు బాధ్యులగుదురని తెలియజేయడమైనది.

ఇట్లు:- టి.వి నవకుమార్,
సి.హెచ్ రమాదేవి,
కె.ఆర్ రాఘవేంద్రరావు,
న్యాయవాదులు, గాంధీనగర్, విజయవాడ-3.
ఫోన్:94401 09153, 92464 15808

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్డి వారి కోర్టు, విజయవాడ.
ఇ.పి నెం: 81/2021 ఇన్ ఒ.యస్ నెం:35/2019

బిట్వీన్ :

భవిరిశెట్టి శ్రీనివాస్ .... డిక్రీహోల్డార్
మరియు
షేక్ నజీర్ బాషా..................జడ్జిమెంట్ డెటార్

సేల్ ప్రకటన

కృష్ణాజిల్లా, పటమట సబ్ రిజిష్టార్ ఇలాకా, విజయవాడ తాలుకా, జవహర్ ఆటోనగర్ లోని జె.డి.ఆర్ కు సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములు కలిగి,ఈ దావా బాకీ క్రింద ఫైలు జప్తు కాబడి, ఈ ఇ.పి బాకీ క్రింద ది.27-01-2025వ తేది ఉదయం 10.00 గంటల లగాయతు పై కోర్టు వారి ఎదుట వేలము జరుపబడును. ఆర్.ఎస్ నెం :152, బ్లాక్ నెం: ఎ1, ప్లాట్ నెం: 66, అసెస్మెంట్ నెం:36260/1, డోర్ నెం.55-3-32 దాఖలా 100 చ.గ. సరిసమానమైన 83.61 చ.మీటర్లు మరియు ఆర్.సి.సి బిల్డింగ్ కన్‌స్ట్రక్టెడ్ గ్రౌండ్ ఫ్లోర్ మరియు 1వ ఫ్లోర్‌కు హద్దులు:

తూర్పు: 60.0 అడుగుల వెడల్పు గల రోడ్డు అ.24.0లు, దక్షిణం: కర్రి నాగూర్ గారి ఆస్తి అ.37.6లు, పడమర: బొక్కసం ప్రభాకరరావు ఆస్తి 24.0లు, ఉత్తరం: బొక్కసం ప్రభాకరరావు ఆస్తి అ.37.6లు,

డి.హెచ్.ఆర్ వాల్యూ...............రూ.30,00,000/-
అమీనా వాల్యూ...................రూ.40,00,000/-

1) ఇ.సి దాఖలా మార్టిగేజి యర్రంశెట్టి రాఘవయ్యపేరు మీద ఉన్నందున దానికి లోబడి వేలం జరుపబడును. 2) యం.సి దాఖలా ఎట్టి బాకాయిలు లేవు. (శ్రీకోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

ఇట్లు:- అన్నపురెడ్డి శ్యామసుందర రెడ్డి, అడ్వకేట్,
డోర్ నెం: 24-3-4, ప్లాట్ నెం: 108, సిద్ధార్ధ అపార్టుమెంట్స్, ఐనాక్స్‌థియేటర్ ప్రక్కన,
గాంధీనగర్,విజయవాడ-520003, మొబైల్ నెం:9866338299



ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం

వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరు వాకర్స్ అసోసియేష న్ కార్యవర్గం ఆదివారం ప్రమాణ స్వీకారం చేసింది. ఏజీఅండ్ సీఎస్ కళాశాల ఆవరణలో ఆదివారం జరిగిన సమావేశంలో అసోసి యేషన్ అధ్యక్షుడుగా కొడె సాంబశివరావు, కార్యదర్శిగా టి చంటిబాబు, కోశాధికారిగా గోకా శ్రీనివాసరావు, సర్వీస్ కార్యదర్శిగా యెండూరి బాలా ప్రసాద్ చేత అసోసియేష న్ జిల్లా గవర్నర్ సనకా సుబ్బారావు ప్రమాణస్వీకారం చేశారు. జోన్ చైర్పర్సన్ నెల్లి రాంబాబు, జిల్లా అసిస్టెంట్ డిప్యూటీ గవర్నర్ పొగిరి రాము, జిల్లా మెడికల్ సర్వీస్ చైర్పర్సన్ ఎస్ తిరుమలరావు, ఉయ్యూరు కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, వినయ్కుమార్, పలువురు ప్రముఖులు ఈకార్యక్రమానికి హాజరయ్యారు.

మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా 3కె రన్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : మన జీవితాలను చిత్తు చేసే మాదక ద్రవ్యాలను సమాజం నుండి తరిమికొడదామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా యువజన దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అనంతరం మచిలీపట్నంలో వీర్లాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'డ్రగ్స్ వద్దు బ్రో' నినాదంతో త్రీ కె రన్ ప్రారంభించారు. ప్రపంచంలో యువత ఎక్కువగా ఉన్న దేశం మనది మాత్రమేనని, అలాంటి యువత డ్రగ్స్, గంజాయి బారిన పడి తమ జీవితాలతో పాటు దేశ భవిష్యత్తును నాశనం చేయొద్దన్నారు. మన దేశాన్ని కాపాడే బాధ్యత మన యువతపైనే ఉందని, అందుకే డ్రగ్స్ వాడొద్దు.. వాడనివ్వొద్దని పిలుపునిచ్చారు.

మినీ గోకులం షెడ్డు ప్రారంభం

ప్రజాశక్తి-ఉయ్యూరు : పశుపోషణకు ప్రభుత్వం అమలుచేస్తున్న మినీ గోకులం పథకం సద్వినియోగం చేసుకుని పాడిపరిశ్రమ అభివృద్ధికి పాటుపడాలని ఎంపీడీఓ శేషగిరిరావు అన్నారు. ఆకునూరు, చినఓగిరాలలో మినిగోకులం షెడ్లను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పశు సంపద పెంచేందుకు ప్రభుత్వం 90శాతం సబ్సిడీతో మినీ గోకులం పథకం ప్రారంభించిందన్నారు. మినీ గోకు లం సద్వినియోగం చేసుకుని పశు పోషకులు లబ్ధి పొందాలన్నారు.

కోడిపందేల బరులు ధ్వంసం



ప్రజాశక్తి-అవనిగడ్డ : సంక్రాంతిని పురస్కరించుకొని జూద క్రీడలు నిర్వహించరాదని జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డిఎస్పి సూచనలతో మండల పరిధిలో ఏర్పాటుచేసిన కోడి పందాల బరులపై సీఐ యువకుమార్ ఎస్సై శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి బరులను ధ్వంసం చేశారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని అవసరమైతే బైండోవర్ కేసులు పెడతామని సిఐ, ఎస్ఐలు హెచ్చరించారు. కాగా ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన నేతలు బరులు ఏర్పాటు చేయడంతో పోలీసులపై ఒత్తిడి తెచ్చి బళ్ళు కొనసాగించేందుకు ఆయా పార్టీల నాయకులు ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది.

సంప్రదాయ పోటీలు నిర్వహించడం అభినందనీయం



విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అవనిగడ్డ : సంక్రాంతి సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయ పోటీలు నిర్వహించడం అభినందనీయమని గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్ రామ్ తెలిపారు. ఆదివారం పంచాయతీ పరిధిలోని బంద్రాయ చెరువు గ్రామంలో సంక్రాంతి సందర్భంగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రామ పార్టీ సీనియర్ నాయకులు కమ్మిలి సాంబశివరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు కమ్మిలి మారిబాబుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ముగ్గుల పోటీలలో విజేతలకు మండల వెంకట్రావు సాయి సుప్రియ దంపతుల చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ ముగ్గుల పోటీలలో జొన్నలగడ్డ రూప రూ.8000, సింహాద్రి మౌనిక ద్వితీయ బహుమతి కింద రూ 6000, జగదీశ్వరి తతీయ బహుమతి కింద రూ 4వేల బహుమతులను పొందారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల పార్టీ అధ్యక్షులు గుడివాడ శేషబాబు, ఎంపీటీసీ సభ్యులు బొప్పన భాను, చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కష్ణకుమారి పాల్గొన్నారు

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-కోడూరు : లెజెండ్స్ సోషల్ సర్వీస్ సంస్థ ను స్థాపించి 22 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, స్వామి వివేకానంద జయంతి, లెజెండ్స్ ఆవిర్భావ దినోత్సవం వారిని పురస్కరించుకుని ప్రభుత్వ జనరల్ వైద్యశాల బ్లడ్ బ్యాంక్ మచిలీపట్నం సహకారంతో లెజెండ్స్ సోషల్ సర్వీస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 12వ మెగా రక్తదాన శిబిరాన్ని కోడూరు ఎస్సై చాణిక్య లెజెండ్స్ సంస్థ అధినేత పూతబోయిన అయ్యప్పస్వామి తండ్రి పూతబోయిన రామారావు ఆదివారం ప్రారంభించారు. ఈ రక్తదాన శిబిరంలో 63 మంది రక్తదాతలు రక్తం అందించారని నిర్వాహకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు శ్రీవాణి, క్యాంప్ ఆర్గనైజర్ రామ్ తుల్లా, సిద్దినేని భారతారావు, అన్నం యోగానంద , బండే కిషోర్ పాల్గొన్నారు.

105 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక లయన్స్ సేవా భవనంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో, రైజ్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ లిఖ్ని ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరంలో కీళ్ళు, ఎముకలు 105 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందజేశారు. అలాగే లయన్ నర్రా గంగాధర్ రావు, వల్లభనేని రామకష్ణ, కొసరాజు బాపయ్య చౌదరి సహ కారంతో 95 మందికి డాక్టర్ గవిరినేని రజిని మధుమేహ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు నిమ్మగడ్డ శశికళ, లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వైపిసి ప్రసాద్, ఎస్ పరంధామయ్య, జంగం మోహన్ రావు, రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలం చంద్రాల గ్రామంలో గుర్తు తెలియని వద్దుడు (80) శనివారం రాత్రి మృతి చెందాడు. వివరాల్లోకెళ్తే సుమారు ఒక నెల రోజుల నుండి చంద్రాల గ్రామంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద ఉంటూ చంద్రాల గ్రామ ప్రజలు వద్ద భిక్షాటన చేస్తూ పెట్టినది తింటూ జీవిస్తున్నారు. అతనిని ప్రజలు ఎన్నిసార్లు తన వివరాలు అడిగినా తాను మాత్రం ఒక్కొక్కసారి ఒక్కొక్క ప్రాంతమని చెపుతూ మతిస్థిమితం లేకుండా ఉన్నాడనీ, వృద్ధుడు సుమారు వారం రోజుల నుండి ప్రజలు పెట్టింది ఏమీ తినకుండా ఉంటున్నాడు. శనివారం సాయంత్రం 6 గంటలకు తనకి కడుపులో నొప్పిగా ఉందని ఆరోగ్యం బాగోలేదని తెలుసుకున్న చిత్రం గ్రామ ప్రజలు అతనిని 108 ద్వారా గుడివాడ గవర్నమెంట్ హాస్పిటల్ కి తరలించారు. ఆ వృద్ధుడు చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న గుడ్లవల్లే ఎస్ఐ ఎన్ వి వి సత్యనారాయణ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

షేక్ సిద్దా సాహెబ్ మృతికి సంతాపం



పెనమలూరు

పెనమలూరు మండలం, యనమల కుదురు గ్రామ సిపిఎం సీనియర్ సభ్యుడు షేక్ సి ద్దా సాహెబ్ (హోటల్ సిద్దయ్య) (64) గుండె పోటుతో ఆదివారం మృతిచెందారు. ఈయన కుమారుడు హుస్సేన్ కూడా పార్టీ సభ్యుడిగా ఉన్నారు. ఈయన మృతికి సిఐటియు పెనమలూరు మండల కార్యదర్శి త్రిమూర్తులు, సిపిఎం పెనమలూరు మండల కార్యదర్శి కాసిం, పార్టీ మండల నాయకులు మస్తానవలి, ఒకటవ శాఖ కార్యదర్శి ఇబ్రహీం, రెండు మూడు శాఖల కార్యదర్శులుషేక్ బాబు, మాధవ, పాపారావు, శ్రీరాములు,పాతాళ లక్ష్మి, వలిబి తదితరులు సంతాపం తెలిపారు.

ఆలయంలో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి-అవనిగడ్డ : మండల పరిధిలోని దక్షిణ చిరువోలు లంక పంచాయతీ శివారు బడుగు వారి పాలెం లో ని రామాలయంలో శనివారం రాత్రి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. రామాలయంలో భక్తులు ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అఖండ జ్యోతి వెలిగించగా కార్యక్రమానంతరం అఖండ జ్యోతి నుంచి మంటలు చెలరేగి ఆలయంలో ఉన్న సీతారాముల వారి పటాలు పూజా సామాగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతి అయ్యాయి. దీనితో వీఆర్వో సురేష్ ఆలయాన్ని పరిశీలించి ప్రమాదం జరిగిన తీరు తెలుసుకున్నారు గ్రామస్తులను విచారించి ప్రమాదానికి గల కారణాలు ఎవరిమీదైనా అనుమానాలు ఉన్నాయా అని గ్రామస్తులను విచారించారు. అనుకోకుండా జరిగిన ప్రమాదమే కానీ ఎవరి మీద అనుమానం లేదని గ్రామస్తులు తెలిపారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-ఉంగుటూరు : మండలంలోని ఆత్కూరు స్టేషన్ పరిధిలో జాతీయ రహదారిపై పొట్టి పాడు టోల్ గేట్ వద్ద రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఎస్ఐ చావా సురేష్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహన దారులతో సురేష్ మాట్లాడుతూ హెల్మెట్, సీటు బెల్టు, లైసెన్సులు, ఫిట్నెస్ సర్టిఫికెట్లు తప్పని సరిగా ఉండాలని వాహన చోదకులు తప్పని సరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి అని అన్నారు. అవి పాటించక పోతే పెనాల్టీ తో పాటు ప్రమాదాలకు గురవుతారు అని అన్నారు. అనంతరం పెండింగ్ చలానాలతో పాటు ఫైన్లు వేశారు.

మంచినీటి కోసం ధర్నా

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని విలియంపేట ప్రాంతంలో గత పది రోజులుగా మున్సిపల్ నీరు రావట్లేదని స్థానిక మహిళలు రోడ్డుపైన బిందెలతో ధర్నా చేశారు. ధర్నా చేస్తున్న విషయం తెలుసుకున్న పట్టణ ఎస్సై వెంకటేశ్వరరావు సంఘటనా స్థలం వద్దకు వచ్చి ధర్నా చేస్తున్న వారితో మాట్లాడి ధర్నాను విరమింపచేశారు.

ఘనంగా జాతీయ యువజన దినోత్సవం



గుడ్లవల్లేరు మండలంలో వివేకానందుడికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలోని గాంధీ క్షేత్రంలో వివేకానంద జయంతిని పురస్కరించుకొని జాతీయ యువజన దినోత్సవం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యావేత్త ఎన్నారై ప్రొఫెసర్ మూల్పూరి వెంకట్రావు బుద్ధ ప్రసాద్ తో కలిసి వివేకానంద విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మూల్పూరి వెంకట్రావును రచయిత వేమూరి రాజేష్ లను బుద్ధ ప్రసాద్ సత్కరించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరు వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ మత్స్యకార వికాస విభాగం రాష్ట్ర కార్యదర్శి లంకె యుగంధర్, జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ క్షేత్రంలో ఈశ్వర్ డాన్స్ అకాడమీ మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులు కర్ర సాము ప్రదర్శన తో విశేషంగా ఆకట్టుకున్నారు. ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్వామి వివేకానంద జయంతి మహోత్సవం జాతీయ యువజన దినోత్సవం మండలంలోని సింగలూరు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. భాగ్య విధాత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామి వివేకానంద జయంతి మహోత్సవానికి ప్రముఖ వైద్య నిపుణులు పైడి సాయినాథ్ ఆస్ట్రేలియా నుండి పాల్గొన్నారు. అలాగే డాక్టర్ జి విజయ్ శ్రీనివాస్ హైదరాబాద్ నుండి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వద్దులకు దుప్పట్ల పంపిణీ, శుభం చిల్డ్రన్స్ వేర్ అధినేత కోసిక కష్ణ సౌజన్యంతో ప్రభుత్వ పాఠశాల బాలబాలికలకు రెడీమేడ్ దుస్తుల పంపిణీ, గద్య సోమరాజు సౌజన్యంతో ప్రభుత్వ పాఠశాలకు కంప్యూటర్ ప్రింటర్ మరియు స్కానర్ అందజేత, సింగలూరు యు ఫ్రెండ్లీ లీవ్ ప్లేట్ బ్రోకర్స్ వారిచే మహిళలకు చీరలు బహుమతులు అందజేశారు. రంగవల్లిలో పాల్గొన్న వారికి బహుమతులు, మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహించారు. ఎస్ ఆర్ జి ఈ సి కరస్పాండెంట్ వల్లూరుపల్లి రామకష్ణ, ఏఎస్ఆర్ కాలేజ్ సెక్రటరీ కె ఎస్ అప్పారావు, చంద్రాల గ్రామ సర్పంచ్ కాలిశెట్టి అర్జున్ రావు పాల్గొన్నారు.



జీవితాల్లోంచి పుట్టినవే కథలు : వేమూరి సత్యం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నేను రాసింది తక్కువ కథలే. వాటి లోని సంఘటనలు, పాత్రలు అన్నీ నా చుట్టూ ఉన్న సమాజంలోంచి స్వీకరించినవే అని ప్రముఖ చిత్ర నిర్మాణ సారథి, కథరచయిత వేమూరి సత్యం అన్నారు.. ఒక కథ అనుకోను ప్రారంభించిన తరవాత, నామీద నాకు ఎప్పుడూ సందేహమే, బాగా రాయగలనా లేదా అని ఎప్పుటికప్పుడు తర్కించుకుంటూ ఉంటాను అన్నారు సత్యం. ఆదివారం శిఖర్ పాఠశాలలో ఆయన కథల సంపుటి 'ఎనభైలో ఇరవై' పుస్తక ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సంపుటిలోని కథలను పరిచయం చేస్తూ చినుకు రాజ గోపాల్, సత్యం కథలలో కథాప్రారంభం, నడక, ముగింపు ఒక ప్రత్యేకతను కలిగివుంటాయని అన్నారు. చాలా సరళమైన భాషలో సంభాషణలను రాయడం, దృశ్యాన్ని కళ్లకు కట్టినట్టుగా రచన చేయడం ఈయన రచనా విశేషమని పేర్కొన్నారు. సత్యం బాల్య మిత్రుడు తుమ్మల గోపాల రావు మాట్లాడుతూ స్వాతి పత్రిక ప్రారంభించిన నుండి, జ్యోతి పత్రిక, సినిమారంగం మీదుగ 'మహర్షి' సినిమా కధారచయితగా, అనేక సినిమాలకు నిర్మాణ సారథిగా జరిగిన ఆయన జీవన గమనాన్ని వివరించారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ కవి బండ్ల మాధవరావు మాట్లాడుతూ సత్యం కథల్లో మానవీయత తొణికిసలాడుతూ ఉంటుందని, ఆయన తొలినాళ్లలో రాసిన కథలకు ఇటీవల రాస్తున్న కథలకు మధ్య తేడాను మనం గమనించవచ్చని అన్నారు. ఆనాటి కథలు అప్పటి జీవితాలను ప్రతిబింబిస్తే, ఇప్పటి కథలు ఈనాటి జీవితాన్ని ప్రతిబింబిస్తాయని అన్నారు. సభలో శ్రీ శ్రీ విశ్వేశ్వరరావు, అంజని యలమంచిలి, తోటకూర రఘు, అనిల్ డ్యానీ, పుప్పాల శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

వార్షిక రీఛార్జ్ పోర్ట్‌ఫోలియోను పటిష్టం చేసిన 'వి'

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : పరిశ్రమలో మొదటిసారిగా సూపర్‌హీరో పథకాన్ని ప్రముఖ టెలికాం ఆపరేటర్ వి తీసుకువచ్చిందని సంస్థ ప్రతినిధి జి.గురునాత్ తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. రాత్రి 12 నుండి మధ్యాహ్నం 12 గంటల మధ్య అపరిమిత డేటాను వినియోగించుకునే అవకాశం అందిస్తుందన్నారు. అధిక వేగవంతమైన డేటా కోసం ఎప్పటికప్పుడు పెరుగుతున్న అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ఇది రూపొందించబడిందని తెలిపారు. వార్షిక ప్యాక్‌లు లేదా మనీ ఆఫర్‌ల కోసం వెతుకుతున్న కస్టమర్ల కోసం మరింత ఆకర్షణీయమైన ఆఫర్లను తీసుకురావటంలో భాగంగా విలో మూడు అత్యుత్తమ విలువ కలిగిన వార్షిక రీఛార్జ్ అవకాశాలను తీసుకువచ్చిందని తెలిపారు. ఇవినెలవారీ ప్లాన్‌లతో పోలిస్తే 25 శాతం అదనపు ఆదా చేయటంతో పాటు సంవత్సరమంతా వినోదం, నిరంతరాయ మొబైల్ డేటా అవసరాలను కూడా తీర్చగలవని తెలిపారు. ఈ ప్రయోజనాలతో పాటు, వినియోగదారులు డిస్నీ ప్లస్ హాట్‌స్టార్, అమెజాన్ ప్రైమ్ లైట్ వంటి ఓటిటి సబ్‌స్క్రిప్షన్‌లను కూడా పూర్తి సంవత్సరం పాటు ఆనందించవచ్చని తెలిపారు.

అభిమానుల సంబరాలు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణంలో విజయ పిక్చర్ ప్యాలెస్‌లో నటరత్న నందమూరి బాలకృష్ణ నటించిన డాకు మహారాజు సినిమా రిలీజ్ సందర్భంగా నందమూరి బాలకృష్ణ అభిమానులు ఆదివారం భారీ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. సినిమా హిట్ అయిన సందర్భంగా స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘ అధ్యక్షులు కొత్త మొగిలేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చావా సతీష్, టిడిపి నాయకులు యంద్రపల్లి శ్రీనివాసరావు, మండవ శ్రీను, కొమ్మినేని దుర్గాప్రసాద్, గర్మిడి ప్రభాకర్, మల్ల వెంకటేశ్వరరావు, శీను తదితరులు పాల్గొన్నారు.

రంగవల్లులు, ఆటల పోటీలు



విజయవాడలో బహుమతులిస్తున్న సిహెచ్.బాబూరావు

ప్రజాశక్తి - సంక్రాంతి పండుగ సందర్భంగా కండ్రిక 64, డివిజన్లలో యువతీ యువకులకు ముగ్గులు, మ్యూజికల్ చైర్, తాడుఆట, కర్ర బిల్లా, ఆటల పోటీలు నిర్వహించారు. ఈ ఆటల్లో పాల్గొన్న విజేతలకు పౌర సంక్షేమ సంఘాల రాష్ట్ర కన్వీనర్ సిహెచ్.బాబూరావు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు సంపర శ్రీనివాసరావు చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. సిఐటియు సెంట్రల్ సిటీ అధ్యక్షులు కె.దుర్గారావు పౌర సంక్షేమ సంఘాల సెంట్రల్ సిటీ కన్వీనర్ బి.రమణారావు ఐద్వా మహిళా సంఘం సెంట్రల్ సిటీ కార్యదర్శి జి.ఝాన్సీ రాణి, పి.వెంకటరెడ్డి, పిచ్చమ్మ లత సావిత్రి సతీష్, సురేష్ పాల్గొన్నారు. **విస్సన్నపేట :** మండలం కలగర గ్రామ పంచాయతీలో సంక్రాంతి పండుగ సంబరాల్లో భాగంగా మండలంలోని ప్రథమంగా ఎన్నారై వల్లభనేని గిరిబాబు ఆధ్వర్యంలో స్థానిక ఎంపియుపి స్కూల్‌లో ముగ్గుల పోటీలను ఎంతో ఘనంగా ప్రారంభించారు. పోటీలలో 37 మంది మహిళలు పాల్గొనగా వారిలో 34 మందికి కన్సోలేషన్ బహుమతులు ఇచ్చారు. మిగిలిన ముగ్గురికి మొదటి బహుమతిగా తోట మేరీ రాణి, రెండో బహుమతి మోటపోతుల సంధ్య, మూడో బహుమతి మోటపోతుల ధరణి గెలుచుకున్నారు. సంక్రాంతి సందర్భంగా తాతకుంట్ల గ్రామంలో ఐద్వా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ ఆటల పోటీల్లో కొవ్వొత్తులు లెమన్ స్పూన్ బెలూన్స్ తదితర ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులిచ్చారు. ఈ బహుమతులను తాతకుంట్ల గ్రామ సర్పంచి ప్రొద్దుటూరు వెంకటేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు ఐద్వా సభ్యులు కళ్యాణి ధరణి సూరమ్మ నిర్మల హారిక మేరీ రజిని అరుణ కనకదుర్గ రాణి వినీల ఝాన్సీ మేఘన తాత్విక బాలు స్వస్తిక్ పవన్ ఆనంద్ ఆర్.సి.యం పాస్టర్ మారియో, ప్రభాకర్‌రావు రాజేష్ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు. **వత్సవాయి :** సింగవరంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్యను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎడ్ల బండిపై ఎక్కించి ఊరేగింపుగా అభివృద్ధి కార్యక్రమాల ప్రాంతానికి వెళ్లారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీల్లో మహిళలు వేసిన వివిధ రంగుల రంగవల్లులు గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. **తిరువూరు :** వాసవి క్లబ్స్.తిరువూరు ఆధ్వర్యంలో స్థానిక గుళ్ళపల్లి రాంబ్రహ్మం రైస్ మిల్లు ఆవరణలో ఆదివారం ఆడ పడుచుల సంక్రాంతి ముగ్గులు, కూర్చీల పోటీలు, సందడిగా జరిగాయి. మొదటి బహుమతి దారా దీప్తి, ద్వితీయ బహుమతి జూలూరు వాసవి శార్వాణి, మూడో విజేత జల్లి సుజాత, మ్యూజికల్ చైర్ లో మొదట బహుమతి రెబ్బు సునీత, రెండో పరిసే రాజే శ్వరి, మూడో విజేత పూర్ణిమ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ నాయకు రాళ్ళు కంచర్ల శశికళ, మండల ఆర్యవైశ్య మహిళా విభాగం అనుమోలు అర్పిత, కార్యదర్శి దారా మంజు, కోశాధికారి జంగాల సునీత, వాసవీ క్లబ్ సభ్యులు సముద్రాల కిరణ్ కుమార్, గుర్రం పవ న్, చిత్తలూరి నాగలక్ష్మి, కొత్త గుండ్ల ప్రసాద్, సహ కరించిన నేత గుళ్లపల్లి రామకష్ణారావు, గుళ్ల పల్లి వెంకటరత్నం, గద్దె వెంకన్న, రామిసెట్టి శ్రీని వాసరావు, నాగుబండి రాజు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

తిరువూరులో...



జగ్గయ్యపేట : ఫ్రెండ్స్ రికరేషన్స్ సంక్రాంతి సందర్భంగా షటిల్, బ్యాడ్మింటన్ పోటీలు డాక్టర్ కామినేని రమేష్ బాబు తల్లిదండ్రులు కామినేని అప్పారావు, సీతారావమ్మ జ్ఞాపకార్థం సంక్రాంతి పండుగ సందర్భంగా మూడు విభాగాలుగా షటిల్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈ షటిల్ బాల్ బ్యాడ్మింటన్ టోర్నీలో విజేతలుగా సీనియర్స్‌లో హనుమంతరావు, కార్తికేయ టీం, జూనియర్స్‌లో నాగేశ్వరరావు, సాగర్ టీం, సూపర్ సీనియర్స్‌లో భూపతి హరి, కనకధర్ టీం విజేతలుగా నిలిచారు. విజేతలకు డిప్యూటీ తహశీల్దార్ నేలం నాగరాజు, ఆర్టీసీ బీవీ రావు, వ్యవస్థాపక అధ్యక్షులు ఆరేపల్లి వెంకటేశ్వర్లు, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ జి లక్ష్మీనారాయణ, కామినేని రమేష్ బాబు ప్రైజ్ మనీ టోర్నీ షీల్డ్ లను ఆదివారం స్థానిక ఎన్ఎస్పి గ్రౌండ్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో బహుమతులు అందజేశారు. మండలంలోని తిరుమలగిరి, పట్టణంలో వ్యవసాయ మార్కెట్ యార్డులలో కృష్ణ స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ నిర్వహించారు. విజేతలకు బహుమతులను ముఖ్య అతిథిగా ఎంఎల్ఎ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పాల్గొని కమిటీ సభ్యులతో కలిసి బహుమతులను అందజేశారు. **కంచికచర్ల :** మండలం గండేపల్లి పరిధిలో గల మామిడి తోటల్లో ఏర్పాటు చేసిన పొట్టేల్ల పోటీలను మండల టిడిపి అధ్యక్షుడు కోగంటి బాబు ఆదివారం ప్రారంభించారు. కంచికచర్ల పరిసర ప్రాంతాలకు చెందిన గొర్రెలు, మేకల పెంపకం దారులు ఆహ్లాదకర వాతావరణంలో పొట్టేల్ల పోటీల్లో పాల్గొన్నారు.



జగ్గయ్యపేటలో బహుమతులందుకున్న బ్యాడ్మింటన్ విజేతలు

పేదల ఇంట... ధరల మంట

ప్రజాశక్తి - మైలవరం : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనాలోచిత నిర్ణయాల వల్ల పెరిగిపోతున్న నిత్యావసరాల ధరలతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు. దీంతో సంక్రాంతికి పెరిగిన ధరలు చూసి వంటల సంగతి దేవుడు ఎరుగు అంటూ ప్రజలు ఏం కొనేతట్టు తినేటట్టు లేమంటున్నారు.

పప్పు దినుసులు, వంట నూనెలు, కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటడంతో ఏం కొనాలో తినాలో అర్థం కాని పరిస్థితి నెలకొనటంతో సామాన్యులు కొట్టుమిట్టాడుతున్నారు. ప్రభుత్వం ధరల నియంత్రణలో చర్యలు తీసుకోకపోవడంతో సామాన్యులు పచ్చడి మెతుకులతో పొట్టనింపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. జేబు నిండా డబ్బులు తీసుకొని వెళితే సంచి సగానికి కూడా సరుకులు రావడం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. నిత్యావసర ధరలు కేజీకి 20 నుండి 30 శాతం పెరగడంతో సామాన్య ప్రజానీకానికి గొంతులో పచ్చివెలక్కాయ పడినట్లు అయింది. కొన్ని మండలాల్లో వ్యాపారులు ఇష్టారాజ్యంగా నిత్యావసర సరుకులతో పాటు కూరగాయ ధరలను పెంచి అమ్ముతున్నారు. అడిగితే మీకు ఇష్టం వచ్చిన దగ్గర కొనుక్కోండి అని మొఖం మీద చెబుతున్నారని పలువురు గృహిణులు వాపోతున్నారు.

సలహా సంఘాలు నిర్వీర్యం : గతంలో ఆహార సలహా సంఘాలు ఉండటంతో ధరలు నియంత్రణలో ఉండేవి. నేడు ప్రభుత్వాలు ఆహార సలహా సంఘాలు ఏర్పాటును గాలికొదిలేశారు. దీంతో వ్యాపారులు తూనికలు, కొలతలలో ఇష్టం వచ్చినట్లు మోసం చేస్తూ వినియోగదారులను దోచుకుంటున్నారు. అసలే ధరలు పెరిగి ఆందోళన చెందుతున్న ప్రజలకు తూనికలలో మోసాలుతో ఇంకా నష్టపోతున్నారు.

నిత్యావసరాలు : ప్రస్తుత ధరలు (కేజీల్లో) ఎండుమిర్చి - 220, చింతపండు - 230 పంచదార -50, కందిపప్పు -180, మినప్పప్పు -135, పెసరపప్పు -130, శనగపప్పు - 120, బెల్లం-70, పామాయిల్ -145, సన్‌ఫ్లవర్ -150, వేరుశనగ నూనె -150, పల్లీలు -140 రూపాయలుంది.

ధరల నియంత్రణ లేదు : పివి ఆంజనేయులు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు

'ప్రభుత్వం ధరల నియంత్రణ చర్యలను గాలికి వదిలేసింది. వ్యాపారులు ఇష్టారాజ్యంగా ఒక్కో రేట్లు పెట్టి నోట్లో మట్టి కొడుతున్నారు. రైతు పండించే పంటలకు గిట్టుబాటు ధర లేదు కానీ అదే రైతు పండించిన పంట దుకాణాల్లో మాత్రం ఇష్టం వచ్చిన రేటుకు అమ్ముతున్నారు. ఈ సంవత్సరం నిత్యావసర ధరలతో పాటు పప్పులు నూనెల రేట్లు బాగా పెరిగాయి. మార్కెట్లో వ్యాపారులు వారి ఇష్టం వచ్చినట్లు విక్రయిస్తున్నారు.

బరులు సిద్ధం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ నియోజకవర్గంలో సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందాల బరుల వద్ద ఏర్పాట్లు సర్వం సిద్ధం అయ్యాయి. ఇంకా వాటి మీద పోలీసులు, రెవెన్యూ, పశుసంవర్ధక శాఖ, అటవి శాఖ అధికారుల దాడులే మిగిలాయి. నిన్నటి వరకు సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందాలు, గుండాటా, జూదలు ఏర్పాటు చేస్తే తాట తీస్తామని ప్రకటించిన అధికారులు ఇంత జరుగుతున్న కనుచూపు మేరలో కనిపించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బరులు నిర్వాహకులను ఆయా పోలీసు స్టేషన్ లకు పిలిపించి మామూలు మాట్లాడే హడావుడిలో ఆయా స్టేషన్లు సిబ్బంది ఉన్నట్లు సమాచారం. శని, ఆదివారాలు వరుసగా రెండు రోజులు అధికారులకు శెలవులు రావడంతో బరుల నిర్వాహకులు బరితెగించి ఏర్పాట్లు చేశారు. నందిగామ మండలం పల్లగిరి, హనుమంతుపాలెటం, రామిరెడ్డిపల్లి, చందర్లపాడు మండలం చందర్లపాడు, కంచికచర్ల, వీరులపాడు మండలాలలో పలు చోట్ల కోడి పందాల బరులు ఏర్పాటు చేశారు. తగిన పోలీసులు మాత్రం అక్కడక్కడ బరులపై దాడులు నిర్వహించినట్లు చెప్తున్నారు. ఇంత జరుగుతున్న ఉన్నత స్థాయి అధికారుల హెచ్చరికలకు విలువ లేకుండా పోయింది. బహిరంగంగా బరులు సిద్ధం అయితే ఈ అధికారులు ఏం చేస్తున్నారు అనే విషయంపై ప్రజల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. పవిత్ర పుణ్యక్షేత్రం అయిన పెనుగంచిప్రోలులో సంక్రాంతి పండుగ సందర్భంగా అసాంఘిక కార్యకలాపాలు భారీ ఎత్తున జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సహజంగా సాంప్రదాయ పద్ధతిలో వివిధ రకాల పోటీలు నిర్వహిస్తూ ఉంటారు. అయితే గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సారి సంక్రాంతి పండుగ సందర్భంగా కాసినో, జూదలు పెద్ద ఎత్తున ఎర్పాటు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఉమ్మడి రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రాలలో 12వ స్థానం, ప్రస్తుత విభజన ఆంధ్రప్రదేశ్ లో రెండవ స్థానంలో ఉన్న పెనుగంచిప్రోలు గ్రామంలో దేవాలయం ప్రతిష్ట మసకబారే విధంగా ఇలాంటి జూద క్రీడలు నిర్వహించడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఒక ఎసి కళ్యాణమండపంలో జూదరులకు సకల సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఇంత జరుగుతున్న విజయవాడ సిపి గాని, నందిగామ ఎసిపి గాని, విజయవాడ రూరల్ డిసిపి గాని, జగ్గయ్యపేట సిఐ కాని, స్థానిక ఎస్ఐ గాని తమకేమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పవిత్ర పుణ్య క్షేత్రాంలో ఇలాంటి జూద క్రీడలు నిర్వహించకుండా సంబంధిత శాఖల అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని పెనుగంచిప్రోలు ప్రజలు, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అమ్మవారి భక్తులు డిమాండ్ చేస్తున్నారు. సంక్రాంతి పండుగను ఆసరాగా చేసుకుని ఇలాంటి జూద క్రీడలు నిర్వహించడం వెనుక స్థానిక ప్రజా ప్రతినిధుల పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నట్లు సమాచారం. ఇక్కడ నిర్వహించే కాసినో జూద క్రీడలలో ఎంట్రీ ఫీజు సుమారు ఒకరికి 50 వేల రూపాయలు నిర్ణయించినట్లు తెలుస్తోంది. పవిత్ర పుణ్యక్షేత్రం అయిన పెనుగంచిప్రోలు లో ఇలాంటి పరిస్థితులకు అధికారులు అడ్డు కట్ట వేయాలని ప్రజలు, యాత్రికులు కోరుతున్నారు.

జూద క్రీడలకు రంగం సిద్ధం

ప్రజాశక్తి-గన్నవరం : సంప్రదాయం ముసుగులో గన్నవరం ప్రాంతంలో ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో క్యాసినో తరహాలో భారీగా జూద క్రీడకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈసారి గన్నవరం పేరు రాష్ట్రంలోనే కాదు, బెంగళూరు, ఇతర రాష్ట్రాల్లోనూ మారుమోగనుంది. పందెంరాయుళ్లను ఆకట్టుకునేలా ఛీర్ గర్ల్స్ ను రప్పిస్తున్నారట. ప్రైవేటు సెక్యూరిటీ, బౌన్సర్లను పెట్టారు. సమన్వయ లోపం తలెత్త కుండా వాకీటాకీలను వాడనున్నట్లు తెలిసింది. నాయకులు కీలకపాత్ర పోషిస్తున్నారట. నియోజకవర్గ పరిధిలోని రామవరప్పాడు, సూరంపల్లి, బాపులపాడు మండలం అంపాపురం తదితర ప్రాంతాలు వేదిక అయ్యాయి. తెలుగు రాష్ట్రాల్లో వివిధ ప్రాంతాల నుంచి చెయ్యి తిరిగిన ఆటగాళ్లు ఇక్కడికి వస్తారు. పెద్దబరుల వద్దకు పెద్ద సంఖ్యలో సాధారణ ఆటగాళ్లు వస్తుంటారు. ఇలా వచ్చి పందేలు కాసే వారికి సామాజిక మాధ్యమాల్లో నిర్వాహకులు ఆహ్వా నాలు, లొకేషనూ పంపుతున్నారు. ముగ్గుల పోటీలు, ఎద్దుల పోటీలలని అనుమతి తీసుకుని బరులను ముస్తాబు చేస్తున్నారు. ఇంత జరుగు తున్నా పోలీసులు ఏమీ తెలియ నటు వ్యవహరిస్తున్నారు. సూరంపల్లి మామిడి తోటలో ఆగిరిపల్లి మెయిన్ రోడ్డుకు సమీపంలో మామిడి తోటల్లో బహిరంగ ఏర్పాట్లు జరుగుతున్నాయి. మూడు ఎకరాల భూమిని మూడు రోజులకు అద్దెకు తీసు కుని సిద్ధం చేస్తున్నారు. పందేలు రూ లక్షల్లో సాగే వీలుందని అంచనా. రేకుల షెడ్లు వేసి ఏసీలు బిగిస్తున్నారు. లక్షలు కాసేవాళ్లు మూడు రోజులు లోపల ఉండి ఆటలో పాల్గొంటారట. హాల్లోకి ప్రవేశ రుసుము ఒక్కొక్కరికి రూ. 50 వేలని తెలిసింది.

బాపులపాడు మండలం అంపాపురంలో



జూదం నిర్వహణకు జరుగుతున్న ఏర్పాట్లు

ఏటా భారీ జూద శిబిరం నిర్వహిస్తారు. రాష్ట్రంలోనే పెద్ద జూద శిబిరాల్లో ఇదొకటి. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న వెంచర్ లో భారీగా జూద నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. రామవరప్పాడులో 16 ఎకరాల రియల్ ఎస్టేట్ వెంచర్లో, ఎనికేపాడులో 15 ఎకరాలలో చదును చేసి బరులు వేస్తున్నారు. ఏసీలు, కూలర్లు, గ్యాలరీలు, భారీ తెరలతో ఏర్పాట్లు చేస్తున్నారు. పలుకుబడి కలిగిన నాయకులు వీటి వెనుక ఉన్నారని నిర్వాహకులు చెబుతున్నారు.



నేటి నుంచి తంబి మహోత్సవాలు

ప్రజాశక్తి-ఉంగుటూరు : 13 నుండి 15 వరకు జరుగు బ్రదర్ జోసఫ్ తంబి 80 వర్ధంతి తిరునాళ్ల నిర్వహణకు సర్వం సిద్ధమైందని బ్రదర్ జోసఫ్ తంబి పుణ్యక్షేత్రం రెక్టర్ రెవ ఫాదర్ జోసఫ్ పాలడుగు అన్నారు. ఆదివారం మీడియాతో మాట్లాడిన ఫాదర్ జోసఫ్ తంబి 80 వ వర్ధంతి మహొూత్సవాలకు అన్ని రకాల అనుమతులు తీసుకున్నామని, అదే విధంగా వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. అధికారుల నుండి పూర్తి సహాయ సహకారాలు ఉన్నాయని తెలిపారు. 80 వ వర్ధంతి తిరునాళ్ల సందర్భంగా న నవదిన. ప్రార్థనలు ముగింపు సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆరోగ్య నగర్ కామారెడ్డి విచారణ గురువులు రెవ ఫాదర్ విన్నాబాబు పొలిమేర శెట్టి మాట్లాడుతూ క్రీస్తును అనుసరించడంలో దైవ సేవకుడు బ్రదర్ జోసఫ్ తంబి మనందరికీ ఆదర్శమని అన్నారు.

శ్రీ మల్లికార్జున హైస్కూల్లో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-గన్నవరం : శ్రీ మల్లికార్జున హై స్కూల్ లో ఆదివారం ముగ్గుల పోటీలు , సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. భోగి మంటలు ,పాల పొంగళ్ళు , కోడి పందాలు , గాలిపటాలు , భోగి పళ్ళు , గొబ్బెమ్మలు , హరిదాసు, గంగిరెద్దుల విన్యాసాలు, విద్యార్థులు సాంస్కతిక కార్యక్రమాలు ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథులు ప్రముఖ కాంట్రాక్టర్ జాస్తి వెంకటేశ్వర రావు, అడిషనల్ ఎస్పి నాదెండ్ల బాల మురళీ కష్ణ , దేవినేని సులోచన , నక్కిన చిన వెంకట రాయుడు, నక్కిన మాధవిలత పాల్గొన్నారు. ముగ్గుల పోటీలకు సాంబశివరావు, అడ్వకెట్ నీరజ, స్వర్ణలత, న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ప్రథమ బహుమతి మాధవికి రూ.10,000 నగదు, ద్వితీయ బహుమతి సాహితికి రూ. 5000 నగదు, తతీయ బహుమతి దీప్సికకు రూ.3500 నగదు బహుమతి అందజేశారు.



అంబేద్కర్ ఆశయాలు ఆదర్శనీయం

- విగ్రహావిష్కరణ సభలో మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-గూడూరు : ప్రపంచ మేధావి భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ డా.బి అర్ అంబేద్కర్ ఆశయాలు ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయం అని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. పెడన నియోజకవర్గం గూడూరు మండలం పర్ణశాల గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని శాసన మండలి ఛైర్మన్ మోషేన్ రాజు, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ రావుతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం డా.బి.ఆర్.అంబేద్కర్ పడిన శ్రమను ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ తలచుకోవాల్సిందేనని, అప్పుడే ఆయనకు మనం గౌరవించుకున్నట్లు అన్నారు. నేడు మనకు దక్కిన ఈ స్వతంత్ర్యానికి కారణం అంబేద్కర్ రచించిన



మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

రాజ్యాంగమేనన్నారు. సూర్య చంద్రులు ఉన్నంత కాలం, భారత రాజ్యాంగం ఉన్నంత కాలం అంబేద్కర్ పేరు ఛిరస్థాయిగా నిలిచిపోవడం తథ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో పెడన ఎమ్మెల్యే కాగిత కష్ణ ప్రసాద్, మోక సత్తిబాబు ఐపీఎస్ , కొనకళ్ళ జగన్నాధ రావు (బుల్లయ్య) మాజీ ఎమ్మెల్యే పాటూరి రామయ్య పాల్గొన్నారు.

ఘనంగా తాడంకి ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలు



మాట్లాడుతున్న ఎంపి బాలశౌరి

ప్రజాశక్తి-పమిడిముక్కల : పమిడిముక్కల మండలం లోని తాడంకి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం, పాఠశాల 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు బాలశౌరి పాల్గొని మాట్లాడుతూ స్వతంత్రం రాకముందే పమిడిముక్కల మండల పరిధిలో విద్యాబుద్ధులు నేర్చుకోవడానికి పెద్దలు ఈ పాఠశాల ఏర్పాటు చేశారని, ఈ పాఠశాలలో చదువుకుని ఎంతోమంది డాక్టర్లుగా ఇంజనీర్లుగా, ఉపాధ్యాయులుగా, శాస్త్రవేత్తలుగా ఎన్నికై పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చారన్నారు. రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ కార్పొరేటర్ పాఠశాలలకు ధీటుగా తాడింకి పాఠశాల ఉందని అన్నారు. ఎంతోమంది విద్యావంతలను తయారు చేసి సమాజానికి అందించడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పామర్రు ఎంఎల్ఎ వర్ల కుమార్ రాజా, కమిటీ సభ్యులు ఏనుగు మస్తాన్రావు, తాడంకి గ్రామ సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, జడ్పిటిసి సభ్యురాలు ఏనుగు వెంకటరమణకుమారి, ప్రధానోపాధ్యాయులు ఎలమంచిలి శివనాగ ప్రసాద్, ఉపాధ్యాయులు మట్టా విజయకుమార్, రవికుమార్, వనిత, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జక్కా శ్రీనివాసరావు, మాజీ ఎంఎల్ఎ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-ఉయ్యూరు : భారతదేశానికి వామపక్ష పార్టీ నాయకులు చాలా అవసరం అని ప్రముఖ వైద్యులు పాలడుగు సాంబశివరావు అన్నారు. ఆదివారం పట్టణంలోనే 15వ వార్డులో సిఐటియు ఐద్వా కష్ణాజిల్లా చిల్డ్రన్ క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ముగ్గులు పోటీలు మ్యూజికల్ చైర్స్ లెమన్ స్పూన్ పెద్దలకు చిన్న పిల్లలకు ఈ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటల పోటీల లో గెలుపొందిన విజేతలకు డాక్టర్ పాలడుగు సాంబశివరావు చేతుల మీదగా ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు బి కీర్తి సిఐటియు నాయకులు మదగాని వీరయ్య, ఎడ్లపల్లి



బహుమతులు అందిస్తున్న దృశ్యం

వెంకయ్య, బిట్టు శీను, బి రాజేష్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : 1987-88 టిటిసి అంగులూరు డైట్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం డైట్ కళాశాలలో నిర్వహించారు. శ్రీకాకుళం నుండి నెల్లూరు వరకు వివిధ స్థాయిలలో విద్యా సేవలో అంకితమైన పూర్వ విద్యార్థులు జాతీయ యువజన దినోత్సవ సందర్భంగా స్వామి వివేకానందకు అతిథులుగా విచ్చేసిన పూర్వ ప్రిన్సిపాల్ కెపిఎ చౌదరి కే రామ చంద్రరావు, గిరికుమారి, చాగంటి వెంకటేశ్వ రరావు కుటుంబ సభ్యులు పుష్పాంజలి సమర్పించారు. దివంగతులైన నాటి గురువులకు సహాధ్యాయులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ నాటి గురువులతో సహాధ్యాయులతో తమ అనుభవాలను అనుభూతులను పంచుకొన్నారు. గురు సత్కారం అనంతరం సహాధ్యాయులలో విశిష్ట సేవలు అందించిన వారిని గుర్తించి సత్కారం నిర్వహించారు. అంగలూరు డైట్ కళాశాల అభివద్ధికి 30 వేల రూపాయల నగదును సీనియర్ లెక్చరర్ శ్రీ పాకాల వినయ్ కుమార్ కి పూర్వ విద్యార్థులందరి తరపున ప్రభు కుమార్ ద్వారా అందజేశారు.

కలెక్టర్ సంక్రాంతి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లా ప్రజలంతా సుఖ సంతోషాలతో, భోగభాగ్యాలతో, సిరి సంపదలతో తులతూగుతూ ఉండాలని, భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను ఆనందంగా జరుపుకోవాలన్నారు. సంక్రాంతి అనగా నూతన క్రాంతి అని, సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించడాన్ని మకర సంక్రమణము అంటారని, ఈ సంక్రమణాన్నే సంక్రాంతి అంటారన్నారు. సంక్రాంతి పండుగను మొదటి రోజు భోగి మంటలతో, రెండవ రోజు పొంగలి, పిండివంటలతో, పిత దేవతలు, దేవుళ్ల పూజలతో, మూడవ రోజు గోపూజలతో మూడురోజుల పండుగ ఎంతో ఆనందంగా కొనసాగుతుందన్నారు. ప్రజలంతా భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగలను ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవాలని సంక్రాంతి పండుగ శుభాకాంక్షలను తెలిపారు.

తాగునీరు సరఫరా చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-చల్లపల్లి : మొవ్వ మండలం లోని శివారు గ్రామాలకు ప్రతిరోజు తాగునీరు వెంటనే సరఫరా చేయాలని మొవ్వ మం డల సిపిఎం కార్యదర్శి శీలం నారాయణరావు, కమిటీ సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కూచిపూడిలో నారాయ ణరావు మాట్లాడుతూ గత మూడు రోజులుగా మొవ్వ మండలం శివారు గ్రామాలు చినముత్తేవి, అవిరిపూడి, మంత్రిపాలెం, నిడుమోలు గ్రామాలకు తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐలూరు గ్రామంలో ఉన్న మంచినీటి ఎత్తి పోతల భారీ వాటర్ ట్యాంక్ నుండి మండలంలో అన్ని గ్రామాలకు మంచినీటి సరఫరా చేస్తారని వివరించారు . ఈ నేపద్యంలో ఐలూరు నుండి నిడుమోలు వరకు ఉన్న పైపు లైను చిన ముత్తేవి మురుగు కాలువ వంతెన వద్ద పైపులైన్ లీకై మంచినీరు కాలువలోకి రోడ్ల పైన వధా గా ప్రవహించటం వల్ల గత మూడు రోజులుగా గ్రామాలకు మంచినీరు అందటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. గత సంవత్సర కాలంగా పైపులకు మరమ్మత్తు చేయకపోవటం వల్ల ఈపరిస్థితి ఏర్పడిందని, సంబంధిత అధికారులు పాలకుల నిర్లక్ష్యం వల్లనే నేడు గ్రామాలకు నీటి సరఫరా అందటం లేదని విచారం వ్యక్తం చేశారు.



వృథాగా పోతున్న నీరు

వృద్ధులకు వస్త్రాలు బహూకరణ

ప్రజాశక్తి చల్లపల్లి : సంక్రాంతి సందర్భంగా స్థానిక సీయోను వద్ధాశ్రమంలో రావెళ్ల కష్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతన వస్త్రాలను ట్రస్ట్ ఛైర్మన్ రావెళ్ల ఉదయ్ కుమార్ఆదివారం వద్ధులకు బహూకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు మోర్ల శివ, మండవ ప్రేమ్ చంద్, పరుచూరి సురేష్, రావెళ్ల వెంకటకష్ణ, ఆశ్రమ నిర్వాహకులు శీలం భాస్కరరావు పాల్గొన్నారు. మహిళలకు చీరలు, పురుషులకు లుంగీ టవల్స్ అందించారు.

పందేలను పూర్తిస్థాయిలో నివారించేనా !

ప్రజాశక్తి - వత్సవాయి : నియోజకవర్గం ప్రాంతంలో సంక్రాంతి పండుగ సందర్భంగా నియోజకవర్గంలో సుమారు 15 నుండి 20 బరులు ప్రతి యేటా ఏర్పాటుచేయడం ఆనవాయితీగా ఉంది. దీనిలో కోట్లలో పలుచోట్ల పదునైన కత్తులు కట్టి హింసతో కోడి పందేలు, పేకాట, మూడు ముక్కలాట, లోనా బైటా, కాయిరాజ కాయి లాంటి ఆటల కోసం బరులు గుడారాలు ఏర్పాటు చేసి సంక్రాంతి మూడు రోజులు ఆడే ఆనవాయితీ ప్రతి సంవత్సరం జరుగుతుందని బహిరంగంగానే తెలుస్తోంది. కాని ప్రతి యేటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా కోడి పందాల బరులను పోలీసులు ధ్వంసం చేస్తున్నారు.మరో వైపు యేటా నిర్వహించేలా కోడి పందాలను నిర్వహించేలా రంగం సిద్ధం చేస్తున్నట్లుంది కోడి పందాల నిర్వాహకులని పలువురు నోటా గుసగుసలు వినిపిస్తున్నాయి. గ్రామాలలో పలు ప్రాంతంలో కోడి పందాల కోసం కోడ్లను రహస్యంగా ఇప్పటికే పెంచుతున్నట్లు తెలుస్తోంది.డ్రోన్లు సైతం వాటిని గుర్తు పట్టకుండా కోడ్లను రహస్యంగా పెంచుతున్నట్లు ప్రజల నుండి తెలుస్తోంది. పేకాట, గుండాట, లోనా బైటా, మూడు ముక్కలాటలు లాంటి చట్ట వ్యతిరేక ఆటలను నిర్వహించే ప్రయత్నాలు చేయడానికి సన్నాహాలు నిర్వాహకులు చేసుకుంటున్నారనే వాదనలు ప్రజల నుండి వినిపిస్తున్నాయి. ఈ సంక్రాంతికి పోలీసులు కోడి పందేలను, చట్ట వ్యతిరేక ఆటలను నివారించేనా! లేక కోడి పందాల బరులను ఏర్పాటు చేసి ఎప్పటిలాగా కోడి పందేలను ఆడించి నిర్వాహకులు సంక్రాంతి పండుగ చేసుకునేనా వేచి చూడాల్సి ఉంది.



ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - విస్సన్నపేట : విస్సన్నపేట మండలం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000- 2001 సంవత్సరం 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అందరూ ఎంతో ఆనందంగా తమ పూర్వ తరగతి గదుల తోటి పాఠశాల ప్రాంగణం తోటి ఉపాధ్యాయులు ఉపాధ్యాయులతోటి ఉన్నటువంటి కొన్ని సంఘటనలను ఒకరితో ఒకరు పంచుకు న్నారు. ఇలా ఇన్ని సంవత్సరాలు వ్యవధిలో మొదటి సారి అందరూ కలుసుకొని ఆప్యా యంగా పలకరించుకోవడం అందరి కళ్ళల్లో ఆనంద భాష్పాలు కురిశాయి. ఈ కార్యక్రమం లో అందరూ ఎంతో ఉత్సాహంగా గడిపారు.

అంబేద్కర్‌కు నివాళి

ప్రజాశక్తి - తిరువూరు : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై భీమ్, జై బాపూజీ, జైసం విధాన్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరువూరు బోసుబొమ్మ సెంటర్‌లోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్‌ను పార్లమెంట్‌లో అవమాన పరిచేలా మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్ షా ఈ భార తదేశం ఏ రాజ్యాం గాన్ని అనుసరించి నడుస్తుందో ఆ రాజ్యాంగం మీద ప్రమాణం చేసి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

వెల్వడం మేజర్‌కు సాగర్ జలాలు

ప్రజాశక్తి - మైలవరం : మైలవరం బ్రాంచ్ నుండి వెల్వడం మేజర్ కాలువకు ఆదివారం అధికారులు సాగర జనాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కోడూరు డిసి 12వ కాలువ డిసి ఇనుగంటి శోభన్‌బాబు మాట్లాడుతూ శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్ ఆదేశానుసారం కోమటి సుధాకర్‌రావు నేతృత్వంలో ఇరిగేషన్ డిఇలు ఎఇలతో కలిసి సాగర్ జలాలను విడుదల చేశామన్నారు. మామిడి, మొక్కజొన్న, పత్తి చేలకు ప్రస్తుతం నీటి అవసరం ఉందని సాగర్ జలాలు రాకతో మెట్ట పంటలకు ఉపయోగమన్నారు.

ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - వీరులపాడు : జుజ్జూరు మండల కేంద్రంలో శివారు గ్రామం రంగాపురంలో సంక్రాంతి పండుగ పురస్కరించుకొని ముగ్గుల పోటీలు, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విజయవాడ పట్టణానికి చెందిన లీవ్ హాస్పటల్ సౌజన్యంతో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడ లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ కౌన్సిల్ చైర్పర్సన్ దామర్ల శ్రీ శాంతి మాట్లాడుతూ రంగాపురం గ్రామాన్ని విజయవాడ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దత్తత తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో ముగ్గుల పోటీలను లైన్స్ క్లబ్ సభ్యులు పరిశీలించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి రామావత్ కోటి, వైద్యులు సిహెచ్.మనోజ్ కుమార్, లైన్స్ క్లబ్ సభ్యులు పర్వతనేని సుభాష్ బాబు, వి.పి.ఎస్.ఆంజనేయులు పాల్గొన్నారు.



60వ డివిజన్‌లో షటిల్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న దృశ్యం

షటిల్ విజేతలకు బహుమతులు అందజేత



విజేతలకు మెడల్స్, షీల్డ్ అందజేసిన ఎస్‌ఎస్ బ్యాడ్మింటన్ నిర్వాహకులు

ప్రజాశక్తి - మైలవరం : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఎస్-ఎస్ బ్యాట్మెంటన్ అరేనా ఆధ్వర్యంలో మైలవరంలో ఆదివారం షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ షటిల్ పోటీలను లైన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం జోన్ చైర్మన్ జాస్తి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపోటములు సహజమని అన్నారు. 11, 13,15 విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన వారికి షీల్డ్, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ బ్యాడ్మింటన్ అరేనా నిర్వాహకులు చనుమోలు నాగభూషణం, దునకకొండ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



యుటిఎఫ్ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి - తిరువూరు : మండలం గనుగపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి చదువుతున్న 35 మంది విద్యార్థులకు ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు మచ్చా శ్రీనివాస్ సౌజన్యంతో ఆదివారం పాఠశాలలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా య సిబ్బంది రాజేంద్ర ప్రసాద్, రాం ప్రదీప్, సుదర్శన్ పాల్గొన్నారు. దాతకు విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

మైనేని వెంకటరత్నం సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - విస్సన్నపేట : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ సంఘం నిర్మాణంలో మైనేని వెంకటరత్నం ఎనలేని కృషి చేశారని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బిసిహెచ్‌వి.సూర్యనారాయణ అన్నారు. ఆదివారం సాయంత్రం విసన్నపేట యుటిఎఫ్ కార్యాలయంలో మైనేని వెంకటరత్నం వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఆ సందర్భంగా పలువురు మైనేని సేవలను కొనియాడారు. ఐక్య ఉపాధ్యాయ పత్రిక నడపడంలో ఆయన విశేషంగా పని చేశారన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎ.మురళీకృష్ణ యుటిఎఫ్ నాయకులు ఇ.నాగేశ్వరరావు, సిహెచ్.లక్ష్మయ్య, బి.ఆదాం, డి.రాంబాబు ఇతర యుటిఎఫ్ కార్యకర్తలు పాల్గొన్నారు.



మైనేని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

గోకులం షెడ్ ప్రారంభం

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల మండలం గండేపల్లి గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన మినీ గోకులం షెడ్లను మండల టిడిపి అధ్యక్షుడు కోగంటి బాబు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాకతో రైతులకు మంచి రోజులు వచ్చాయన్నారు. పాడి రైతుల సంక్షేమం కోసమే ప్రభుత్వం మినీ గోకులం షెడ్డును మంజూరు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షులు మందడపు రామకృష్ణ, గండేపల్లి సర్పంచ్ బొక్క రవి కుమార్,, టిడిపి నాయకులు బొక్క దేవానందం, ఫీల్డ్ అసిస్టెంట్ బొక్క మోహన్ పాల్గొన్నారు. **వత్సవాయి :** గోపినేనిపాలెంలో పల్లె పండుగలో భాగంగా కాకాని కోటేశ్వరరావుకు చెందిన రూ.2.30 లక్షలతో నిర్మించిన గోకులం షెడ్డును ఎంఎల్‌ఎ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ప్రారంభించారు. రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లకు కొబ్బరికాయ కొట్టి, రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పల్లె పండుగలు గ్రామీణ ప్రాంతాల్లో వెలుగు నింపాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారని అన్నారు. మండల టిడిపి అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, సర్పంచ్ బాణావతు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మృతుడు నరసింహారావు

కల్లుగీత కార్మికుడు మృతి

ప్రజాశక్తి - తిరువూరు : తాటిచెట్టుపై నుండి పని కల్లుగీత కార్మికుడు మృతి చెందిన సంఘటన తిరువూరు రాజుపేటలో ఆదివారం చోటు చేసుకుంది. బజ్జూరి నర సింహారావు (57) ఎప్పట్లాగే తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా మోకు తెగి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

షటిల్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ : సంక్రాంతి పండుగ సందర్భంగా డి.వై.ఎఫ్.ఐ, సిఐటియు, ఐద్వా, ఎస్ఎఫ్ఐ, కెవిపిఎస్, పిఎన్ఎం ఆధ్వర్యంలో వాంబేకాలనీ 60వ డివిజన్ 'ఈ' బ్లాక్ గ్రౌండ్ వద్ద షటిల్ టోర్నమెంట్‌ను టాస్ వేసి ఈ రోజు ఆదివారం ప్రారంభం అయింది. షటిల్ టోర్నమెంట్‌ను సిఐటియు సెంట్రల్ సిటీ అధ్యక్షులు కె.దుర్గారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర నాయకులు ఎస్కె పీరు సాహెబ్, డివైఎఫ్ఐ 60,డివిజన్ కార్యదర్శి పి.రవి, అధ్యక్షులు జి.సాయి ఐద్వా డివిజన్ కార్యదర్శి ఎ.రత్నకుమారి, ప్రజా సంఘాల నాయకులు ఎన్.మహేష్, ఎస్.అప్పన్న కె.రంగస్వామి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : గొల్లపూడిలోని శ్రీ పోసాని నరసింహారావు చౌదరి ఉన్నత పాఠశాలలో 50 సంవత్సరాల క్రితం విద్యనభ్యసించిన 1975 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు స్వర్ణోత్సవ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఆదివారం పాఠశాల ప్రాంగణంలో ఈ కార్యక్రమం నిర్వహించుకొని ఉల్లాసంగా ఆటపాటలతో గడిపారు. నాడు తమకు బోధించిన ఉపాధ్యాయులు హనుమంతరావు, వేంకటేశ్వర్లు, రామకోటేశ్వరరావును సన్మానించారు. అమరులైన ఉపాధ్యాయులు, సహ విద్యార్థులకు నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మార్కెటింగ్ యార్డ్ మాజీ చైర్మన్ జాలిపర్తి గోపాలకృష్ణ, గాంధీ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ వేమూరి వెంకటరావు పాల్గొన్నారు. సుబ్బారావు, సుధీర్, శ్రీనివాస్, శివరామకృష్ణ, మురళి నిర్వహించారు.



గిరిజన మహిళపై దాడి చేసిన ఎంఎల్‌ఎపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ఎ.కొండూరు : మండలంలోని గోపాలపురం గ్రామంనికి చెందిన భూక్య చంటిపై దాడికి పాల్పడిన తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఆదివారం చీమలపాడులోని షేక్ దాదా భవన్లో విలేకరుల సమావేశంలో మండల పార్టీ కార్యదర్శి పానం ఆనందరావు మాట్లాడుతూ ఎంఎల్ఎ కొలికపూడి తాను ఒక్క ఎంఎల్ఎ అనే విషయం మర్చిపోయి గిరిజన మహిళపైన వారి కుటుంబ సభ్యుల పైన విచక్షణ రహితంగా దాడికి పాల్పడ్డారని ఇది అమానుష చర్య అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆళ్ల అమ్మిరెడ్డి సోమ మోహన్‌రావు రావుల రామకృష్ణ, పంభి వెంకటేశ్వరావు పాల్గొన్నారు. భూక్యా చంటి పైన ఆమె కుటుంబ సభ్యులపైన దాడి చేసిన ఎంఎల్ఎ కొలికపూడి శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని కేసు నమోదు చేయాలని వైసిపి నాయకులు ఆర్.మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం తిరువూరు నియోజకవర్గంలోని తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, ఎ.కొండూరు మండలాలకు చెందిన వైసిపి నాయకులు కార్యకర్తలు ఎ.కొండూరులోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే కొలికపూడి నియోజకవర్గంలో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. గిరిజన మహిళపై ఎంఎల్ఎ దాడి చేయడం దారుణమన్నారు. ధర్నా అనంతరం వీరు ఎంఎల్ఎపై తగు చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ కార్యాలయంలో విఆర్ఒ షేక్ నాగుల్ మీరాకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వీరు ఎ.కొండూరు పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ చల్లా కృష్ణకు రిపోర్ట్ ఇచ్చి కేసు నమోదు చెయ్యాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు వీరు బాధితురాలి ఇంటికి వెళ్లి పరామర్శిం చారు. వైసిపి నాయకులు ఎన్.వీరరెడ్డి ఎంపిపి కలసని నాగలక్ష్మి, చెన్నారావు, ఎంపిటిసి కోట పుల్ల రావు జడ్పీటీసీ భూక్యా గనీయ ఎస్టీ సెల్ నాయకులు మూడు రవి కుమార్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎ.కొండూరు తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం



నోటీసులు అందిస్తున్న పోలీసులు

జూదాలు వద్దు.. సంప్రదాయ క్రీడలే ముద్దు : ఎస్ఐ

ప్రజాశక్తి-గన్నవరం : ఆత్కూర్ పిఎస్ పరిధిలో గల గన్నవరం మండలం చిన ఆవు టపల్లి మరియు తెంపల్లి గ్రామంలో కోడిపందాలు వద్దు క్రీడలే ముద్దు అని ప్రచారం ఆదివారం చేశారు. ఎస్సై చావా సురేష్ ఈ వినూత్న కార్యక్రమం చేపట్టారు. కోడి పందాల బరులు ఏర్పాటు చేస్తున్నారనే సమాచారంతో అక్కడకు చేరుకొని అక్కడి నిర్వాహకులకు నోటీసులు ఇచ్చారు. జూదాలకు పాల్పడుట చట్టరీత్యా నేరమని, అటువంటి కార్యక్రమాలకు ఎవరు ఏర్పాట్లు చేసినా స్థలాలు, షామియానాలు మరియు మైక్ సిస్టంలు అద్దెకు ఇచ్చి సహకరించిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పండగ సమయంలో కుటుంబ సభ్యులంతా సాంప్రదాయ పద్ధతిలో పండగ జరుపుకుంటూ సంతోషంగా ఉండాలన్నారు. ఇప్పటికే 60 మందిని గుర్తించి స్థానిక మండల రెవెన్యూ అధికారుల వద్ద హాజరు పరిచి బైండోవర్ చేశామన్నారు.

బహుమతులు అందజేత

ప్రజాశక్తి-ఉంగుటూరు : బాపులపాడు మండలంలోని అంపాపురంలో గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు ఏపీ ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన లక్ష్మికి 8 వేలు, ద్వితీయ స్థానం సాధించిన పద్మకి 6 వేలు, తృతీయ స్థానం సాధించిన జగదీశ్వర్ కి 5 వేలు నగదు బహుమతులతో పాటుగా పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ 3 వేల రూపాయలు చొప్పున ప్రోత్సాహక బహుమ తులను సాయి కళ్యాణి, రమ అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షురాలు మేడిపల్లి రమ, తెలుగు యువత గ్రామ అధ్యక్షులు సుంకర రాజా, అంపాపురం గ్రామ టిడిపి కార్యదర్శి వెంకటేశ్వరరావు, అన్నే శ్రీనివాసరావు, బాబి, నాగరాజు, పాల్గొన్నారు.



కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-మోపిదేవి : అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ,ప్రముఖ విద్యావేత్త అమెరికాలో ప్రొఫెసర్ గా సేవలు అందిస్తున్న ముల్పూరి వెంకట్రావ్ చేతుల మీదుగా ఆదివారం సంక్రాంతి శుభాకాంక్షలతో జనసేన పార్టీ కేలండర్‌ను ఆదివారం అవనిగడ్డ లోని స్థానిక గాంధీ క్షేత్రంలో ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో కోసూరు పాలెం జనసేన యూత్ బోగిరెడ్డి సాంబశివరావు, కాగితాల సాంబశివరావు, మత్తి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వికెఆర్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి గన్నవరం : గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలోని వికేఆర్ కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అపూర్వంగా.. పండుగలా.. ఆదివారం కళాశాల ప్రాంగణంలో జరిగింది. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులు.. తమలోని ప్రేమను చాటుకున్నారు. మన కలయిక అపూర్వం.. అంటూ నాటి తీపి జ్ఞాపకాలను నెమర వేసుకున్నారు. ఆప్యాయత పలకరింపులు.. నాటి చిలిపి పనులతో పులకరింపులు.. జోకులతో కేరింతలు.. జీవితంలో సాధించిన విజయాలను పంచుకుని ఆ పాత మిత్రుల కలయికతో, ఎంతో ఆనందంగా నాటి అధ్యాపకులతో కలసి ఆత్మీయ సమ్మేళనం పండుగలా జరిపారు. ఇతర దేశాల నుండి వచ్చిన విద్యార్థులతో పాటు ఇతర రాష్ట్రాలు, ముఖ్య పట్టణాలలో నుంచి, గ్రామీణ ప్రాంతాల నుంచి 1969 నుంచి 2025 వరకు విద్యార్థులందరూ ఒకే చోట కలిసి పండుగ వాతావ రణాన్ని మైమరపించేలా సందడి చేశారు.ముందుగా వేములపల్లి కోదండ రామయ్య, లక్ష్మీ అన్నపూర్ణమ్మ దంపతులు, తొలి ప్రిన్సిపాల్ తాతినేని శ్రీనివాసరావు చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మూల్పూరి వెంకట లక్ష్మీప్రసాద్, నాదెండ్ల బాలమురళీకష్ణ లు స్వాగతోపన్యాసం చేశారు. కళాశాల రిటైర్డు అధ్యాపకులు మద్దుకూరి విజయకుమార్, సీతా రామస్వామి, గాంధీ బాబు లు మాట్లాడారు.



పూర్వ విద్యార్థులు

గుడివాడలో సంక్రాంతి సంబరాలు ప్రారంభం

ప్రజాశక్తి - గుడివాడ : సంక్రాంతి పండుగ గ్రామీణ సంస్కతి, సంప్రదాయాలకు నెలవు అని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఆదివారం గుడివాడ రూరల్ మండల టిడిపి అధ్యక్షుడు వాసే మురళి ఆధ్వర్యంలో బొమ్ములూరు గ్రామ శివారు టిడ్కో కాలనీలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాల్లో కూటమి నేతలతో కలిసి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొన్నారు. సంక్రాంతి సంబరాల్లో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలను ఎమ్మెల్యే రాము పరిశీలించారు. అనంతరం గొబ్బెమ్మలు, నత్యాలు, కోలాట ప్రదర్శనలు, గంగిరెద్దుల విన్యాసాలు, కూచిపూడి నత్య ప్రదర్శనలు, హరిదాసు కీర్తనలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, గుడివాడ రూరల్ మండలం తెలుగుయువత అధ్యక్షుడు కర్రే వెంకటగిరి, జనసేన పార్టీ ఇంచార్జి బూరగడ్డ శ్రీకాంత్, టిడిపి నాయకులు లింగం ప్రసాద్, డాక్టర్ గోర్జి సత్యనారాయణ పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న ఎంఎల్ఎ వెనిగండ్ల రాము

నందివాడ మండలంలో...

నందివాడ మండలం పోలుకొండ గ్రామంలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొన్నారు. సంబరాల్లో నిర్వహించిన ముగ్గుల పోటీలను ఎమ్మెల్యే రాము తిలకించారు. అనంతరం పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులను అందచేశారు. మండల టిడిపి అధ్యక్షుడు దానేటి సన్యాసరావు, టిడిపి నాయకులు ఉప్పల వెంకటేశ్వరరావు, తమ్మారెడ్డి శ్రీను, సర్పంచ్ మానేపల్లి ఝాన్సీ రాణి పాల్గొన్నారు.

షటిల్ పోటీల విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-చల్లపల్లి : సంక్రాంతి పండుగ సందర్భంగా జనసేన ఆధ్వర్యంలో చల్లపల్లి లో జరిగిన అవనిగడ్డ నియోజకవర్గ షటిల్ టోర్నమెంట్స్ పోటీలలో 28 టీమ్‌లు పాల్గొన్నారు. ఈ పోటీలు ముగింపు సందర్భంగా అదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలి వెంకటరామ్, స్థానిక ఎస్ఐ పిఎస్‌వి సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథి లుగా పాల్గొని విజేతలకు బహుమతులు అందచేశారు. చల్లపల్లిలో జరిగిన అవనిగడ్డ నియోజవర్గ స్థాయి షటిల్ టోర్నమెంట్ ఫైనల్స్ లో అవనిగడ్డకి చెందిన పాణి, రవి గెలుపొందగా వీరికి ట్రోఫీతో పాటు 5000 రూపాయల ప్రైజ్ మనీని, రన్నరప్ గా చల్లపల్లి కి చెందిన సుభాష్, అంకబాబు రన్నరప్ విజేత కాగ వీరికి రన్నరప్ ట్రోఫీతో పాటు 3000 రూపాయల ప్రైజ్ మనీని నిర్వాహకులు అందజేశారు.. మూడవ స్థానంలో చల్లపల్లి కి రఫి మాస్టర్, శ్రవణ్ నిలిచారు. వీరికి ట్రోఫీతో పాటు 2000 రూపాయలు ప్రైజ్ మనీనిముఖ్య అతిదులు అందజేశారు. జనసేన పార్టీ ఉమ్మడి కృష్ణా జిల్లా లీగల్ సెల్ జనరల్ సెక్రటరీ బాసు నాంచారయ్య నాయుడు మొదటి బహుమతి విజేతలకు 5000 రూపాయలు,కప్ టోర్నీ స్పాన్సర్షిప్ కింద టోర్నమెంట్ నిర్వాహకులకు అందజేశారు. చల్లపల్లి టౌన్ అధ్యక్షులు బొందలపాటి వీరబాబు, పాత నడకుదురు గ్రామానికి చెందిన సుమంత్, రాహుల్ కి ప్రత్యేక ప్రోత్సాహం కింద 2000 రూపాయలు అందజేశారు. టోర్నమెంట్ ఆసాంతం విజయవంతంగా జరిగేలా టోర్నమెంట్ నిర్వాహకులు బొందలపాటి వీరబాబు, అడపా రవి , మిరియాల జితేంద్ర, దాస్ మాస్టర్, అయ్యప్ప , సురేష్ కృషి చేశారు.

ఆకట్టుకున్న రంగవల్లుల పోటీలు

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల జలధీశ్వర ఆలయం ప్రాంగణంలో సంక్రాంతి సంబరాలులో భాగంగా ఆదివారం ముగ్గులు పోటీలను ఎన్నారై మూల్పూరి వెంకట్రావు ప్రారంభించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మూల్పూరి కుమారుడు ప్రభాస్ భారతీయుడు మూల్పూరి వెంకట్రావు ఆర్థిక సహకారంతో స్వచ్ఛ ఘంటసాల బందం పర్య వేక్షణలో సంక్రాంతి సంబరాలలో భాగంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఘంటసాలకు చెందిన 50 మందికి పైగా మహిళలు, విద్యార్థినులు ముగ్గుల పోటీల్లో ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. సీనియర్స్ విభాగంలో ముగ్గురికి, జూనియర్స్ విభాగంలో మరో ముగ్గురికి మొత్తం ఆరు రైస్ కుక్కర్లను ప్రథమ, ద్వితీయ, తతీయ, బహుమతులుగా ఎన్నారై మూల్పూరి వెంకట్రావు విజేతలకు అందజేశారు. సీనియర్స్ విభాగంలో ఎ.జ్యోతినీలిమ, యు. సాహితి, ఎం బేబీ వర్షిత లకు బహుమతులు లభించగా జూనియర్స్ విభాగంలో కే మహతి, బేబీ వేదర్శి , జె. నాగేశ్వరి, ఎ. శివకుమార్ లకు వరుసగా బహుమతులు లభించాయి. ఈ కార్యక్రమంలో ఎన్నారై మూల్పూరి వెంకట్రావు, స్వచ్ఛ ఘంటసాల బందం గొర్రెపాటి సురేష్, పోతన వెంకటేశ్వరరావు, పోతన లక్ష్మీశ్వరరావు ,వడ్లమూడి ప్రసాదరావు , తదితరులు పర్యవేక్షించారు .



విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

కొండలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలోఉన్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం సంధర్భంగా శ్రీ అమ్మవారిని సుమారు 15 వేల మంది పైగా యాత్రికులు దర్శనం చేసుకున్నారు. అత్యధిక స్థాయిలో భక్తులు శ్రీ అమ్మవారికి పాలపొంగళ్ళు సమర్పించి, వారి మొక్కుబడులు తీర్చుకున్నారు.అమ్మవారి దేవస్థానమునకు విచ్చేసిన భక్తులకు తాగు నీరు, శానిటేషన్ ఏర్పాట్లు, ఏ విధమైన అసౌకర్యములు కలగకుండా దర్శనం చేసుకొనుటకు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. దేవస్థానం వద్ద ఎలాంటి అవాంఛనీయ, సంఘటనలు కలగకుండా గుడ్లవల్లేరు ఎస్సై ఎన్ వివి సత్యనారాయణ వారి సిబ్బంది తగు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

మూడో రోజుకు సమ్మె

పెనమలూరు : తాడిగడప మున్సిపాలిటీ తడి పొడి చెత్త సేకరించే డ్రైవర్లు చేస్తున్న సమ్మె ఆదివారంతో మూడో రోజుకు చేరింది. యనమలకుదురు లాకులు సెంటర్ వద్ద నిర్వహించిన నిరసనలో పెనమలూరు మండల ఐద్వా మహిళా సంఘం మండల కార్యదర్శి పుసులూరి పాతాళ లక్ష్మి, పెనమలూరు మండలం ఐద్వా మహిళా సంఘం అధ్యక్షురాలు ఓలేమ్మా మద్దతు తెలిపారు.కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని పెనమలూరు మండలం సిఐటియు కార్యదర్శి త్రిమూర్తులు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో పెనమలూరు మండలం సిఐటియు నాయకులు మస్తాన్వలి, పెనమలూరు మండలం సిపిఎం కార్యదర్శి కాసిం, తడి పొడి చెత్త వ్యాన్ డ్రైవర్ల సిఐటియు అధ్యక్షులు నేరెళ్ల, తడి పొడి వ్యాన్ డ్రైవర్ల సిఐటియు కార్యదర్శి ఎస్ నరేంద్ర, ప్రసాద్, మస్తాన్వలి పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

జల మార్గాల అభివృద్ధిపై సదస్సు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అంతర్గత జలమార్గాల సమగ్ర అభివద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు కషి పై జరిగిన సదస్సు విజయవంతం అయిందని సదస్సు ప్రతినిధి ఎల్ . ముకేష్ తెలిపారు . ఈ. సందర్భంగా నగరంలో ఓ హెూటల్ నందు ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అధ్వర్యంలో సదస్సు జరిగింది అన్నారు. ఈ సదస్సులో నౌకాశ్రయాలు, షిప్పింగ్ అండ్ జలమార్గాల మంత్రిత్వ శాఖ అధికారులు, వాటర్ వేస్ అథారిటీ అధికారులు పాల్గొన్నారనీ తెలిపారు. జల మార్గాలు అభివద్ధికి తీసుకోవలసిన పలు విధానపరమైన నిర్ణయాలపై చర్చించారనీ అన్నారు. నదీతీర పర్యావరణ వ్యవస్థతో పాటు వాణిజ్యం మరియు పర్యాటకాన్ని ప్రోత్సహించడం, నైపుణ్యం పెంపుదల శిక్షణలు అందించడం ద్వారా తీర ప్రాంత ప్రజల సామాజిక-ఆర్థిక శ్రేయస్సును మెరుగుపరచడం కోసం ఒక ప్రధాన విధాన కార్యక్రమం రూపొందించబడిందని చెప్పారు.

వివేకానంద జయంతి

విజయవాడ : చిత్త రంజన్ గ్రేడ్- 2 శాఖ గ్రంథాలయం సత్య నారాయణ పురంలో తత్వవేత్త స్వామి వివేకానంద 162వ, జయంతి వేడుకలు నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొదటిగా గ్రంథాలయ అధికారి పి.సంపత్ వివేకానంద తత్వానికి భోధనలకు వారి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తదుపరి యువత నుద్దేశించి సంపత్ కుమార్ మాట్లాడుతూ వివేకానంద గురించి భారత యువత మనసులో స్ఫూర్తి నింపిన వారిలో వివేకానందుడి అంతటివారు లేరని అన్నారు. లక్ష్య సాధన కొరకు అలుపెరగక శ్రమిస్తూంటే ఇవాళ కాకపోయినా రేపు అయినా విజయం సాధ్యమౌతుందని, పట్టుదల వదలకుండా చివరకు విజయాన్ని చేకూరుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు విద్యార్థులు పాల్గొన్నారు.

సన్ సిరితో సొంతింటి కల సాకారం



నాయకులకు సమస్యను వివరిస్తున్న స్థానిక మహిళలు

రోడ్డు పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : 45వ డివిజన్ ఏకలవ్య నగర్ మూడో లైన్‌లో నిలిపేసిన రోడ్డు పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. పాతిక సంవత్సరాలుగా ఉంటున్న స్థానికంగా ఉన్న పల్లపు విజయలక్ష్మి, బి.సీతారామయ్య నివాసాలు ఎదురుగా రోడ్డు పనులు నిలుపుదల చేశారు. ఈ విషయమై స్థానిక సిపిఎం కమిటీ వారికి ఫిర్యాదు చేయగా ఈ ప్రాంతాన్ని సిపిఎం పశ్చిమ నగర కమిటీ కార్యదర్శి బి.సత్యబాబు, సిపిఎం ఫ్లోర్ లీడర్ నగర కమిటీ సభ్యులు జి.వెంకట్రావు, ఎమ్‌డి మస్తాన్ ఆదివారం పరిశీలిం చారు. ప్రభుత్వం వారు ఇచ్చిన పట్టాలో రోడ్డుగా నమోదు చేశారని, అయినా కొంతమంది కబ్జాదారులు ఈ రోడ్డుని తమ స్థలంగా చెబుతూ రోడ్డు పనులను నిలుపు దల చేయించారని స్థానికులు వాపోయారు. ఇంజ నీరింగ్ అధికారులు చివరి వరకు రోడ్డు వేస్తామని రోడ్లు తవ్వి ఉన్న చెట్లు కూడా తొలగించి ఇప్పుడు కబ్జాదారుల ఒత్తిడి మేరకు రోడ్డు పనులు చేయకుండా నిలుపుదల చేయడం భావ్యం కాదని అన్నారు. వెంటనే ఈ రోడ్డు పనులను పూర్తి చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, విజయవాడ, చిలకలూరిపేట, పిడుగురాళ్ల, అద్దంకి వంటి ప్రముఖ పట్టణాల్లో పలు ప్రాజెక్టులను పూర్తిచేసి, రియల్ ఎస్టేట్ రంగంలో తమకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకుని, ఫ్లాట్స్ కొనుగోలుదారులకు అత్యున్నత సౌకర్యాలతో కూడిన రియల్ ఎస్టేట్ వెంచర్స్‌ను అందించడమే కాకుండా వారి కలలను సాకారం చేసుకోవడానికి ఎంతగానో దోహదం చేస్తూ, నగరంల్లో ఉన్న ప్రముఖ రియల్ ఎస్టేట్ ఏజెన్సీలలో ఒకటిగా, రియల్ ఎస్టేట్ లే అవుట్‌లు, డెవలప్‌మెంట్‌లలో 10 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం ఉన్న ప్రముఖ సంస్థ 'సన్ సిరి ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్' అని సంస్థ అధినేత శ్రీ భాష్యం రాజేష్ (మేనేజింగ్ డైరెక్టర్) ప్రజాశక్తికి తెలిపారు. తమ సంస్థ ప్రారంభమై ఇప్పటికి 10 సంవత్సరాలు పూర్తయిందని, 2015 వ సంవత్సరంలో ఓ సాధారణ రియల్ ఎస్టేట్ సంస్థగా తమ సంస్థను ప్రారంభించామని, కస్టమర్ల ఆదరాభిమానాలు, ఆశీస్సులతో చక్కని అభివృద్ధిని సాధించామని ఆయన తెలిపారు.

రాజధానికే తలమానికం కాబోతున్న రాజధాని అమరావతికి ఐ.ఆర్.ఆర్, విజయవాడ వెస్ట్ బైపాస్ కలిసే గుంటూరు-విజయవాడ ఎన్.హెచ్ -16 హైవే కి అతి చేరువలో ఐటీ హబ్‌గా అభివృద్ధి చెందుతున్న కాజాకు దగ్గరగా ఆధునిక హంగులతో అభివద్ధి చేస్తున్నట్లు తెలిపారు. 'ది రైజ్ ఏ కాజా' అతిపెద్ద గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్ట్, క్లబ్‌హౌస్ సదుపాయం, వ్యక్తిగత గృహాలు, విల్లాలతో పాటు అన్ని సౌకర్యాలతో, అత్యాధునిక వసతులతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. సిఆర్‌డిఎ అప్రూవ్డ్ లే అవుట్, 40 అడుగుల వెడల్పు గల సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ సదుపాయం, 24/7 కరెంట్ సదుపాయం, ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్, లేఅవుట్ చుట్టూ 7 అడుగుల పోడవు కాంపౌండ్ వాల్, అవెన్యూ ప్లాంటేషన్, పిల్లల ఆటస్థలాలు, పార్కులు, 24/7 సిసి కెమెరా సెక్యూరిటీ సదుపాయం, నూరు శాతం వాస్తుకు తగినట్లుగా ప్లాట్లు, బ్యాక్ లోను సదుపాయం కల్పిస్తున్నామన్నారు.

మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ 'ది లోటస్'ఏ పొన్నెకల్లు

ప్రపంచస్థాయి రాజధానిగా అభివృద్ధి చెందుతున్న అమరావతికి సమీపంలో కస్టమర్లకు త్వరగా తాము పెట్టిన పెట్టుబడికి రెండింతలు చేసుకునే అరుదైన అవకాశం. రాజధాని ఇన్నర్ రింగ్ రోడ్డు ఔటర్ రింగ్ రోడ్డు మధ్య వ్యూహాత్మక ప్రాంతంలో, నూతనంగా నిర్మించబడుతున్న అమరావతి రైల్వే స్టేషన్ కు అతి చేరువలో గుంటూరు కార్పొరేషన్ పరిధిలోకి రాబోతున్న పొన్నెకల్లులో 40 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేస్తున్న ప్రీమియం ప్రాజెక్టు అన్నారు.

ది లోటస్ : సిఆర్‌డిఎ అప్రూవ్డ్ లే అవుట్, 40 అడుగుల వెడల్పు గల సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ సదుపాయం, 24 / 7 కరెంట్ సదుపాయం, ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్, లేఅవుట్ చుట్టూ 7 అడుగుల పోడవు కాంపౌండ్ వాల్, అవెన్యూ ప్లాంటేషన్, పిల్లల ఆటస్థలాలు, పార్కులు, 24/7 సీసీ కెమెరా సెక్యూరిటీ సదుపాయం, నూరు శాతం వాస్తుకు తగినట్లుగా ప్లాట్లు, బ్యాక్‌లోను సదుపాయం కల్పిస్తున్నామన్నారు.

కస్టమర్ల ఆధరాభిమానాలే సోపానాలుగా ఈ రంగంలో అభివృద్ధి పథంలో పయనిస్తున్నామనీ కేవలం 9 ఏళ్లలో 16 వెంచర్లు చేపట్టి విజయవంతంగా పూర్తి





చేసినట్లు భాష్యం రాజేష్ సంతోషం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకూ 3 వేల మందికి పైగా ఉన్న సంతోషకరమైన కస్టమర్లే తమ సంస్థ అభివృద్ధికి నిదర్శనమని అయన పేర్కొన్నారు. ఓపెన్ ఫ్లాట్స్, విల్లాస్, ఇండిపెండెంట్ హౌస్ కొనుగోలుదారులకు సన్ సిరి ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఒక అద్భుతమైన అవకాశం అని ఆయన తెలిపారు. ఈ సంక్రాంతి విజయాలకు పునాదిగా నిలిచి, కోరుకున్న ప్రతి కల నిజం కావాలని ఆశిస్తూ తమ కస్టమర్లకు,మార్కెటింగ్ మిత్రులకు, శ్రేయోభిలాషులకు భాష్యం రాజేష్ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు చెబుతున్నారు. ఓపెన్ ఫ్లాట్స్ , ఇండిపెండెంట్ హౌసెస్ కొనదలచినవారు వివరాలకు విజయవాడ, విజయనగర్ కాలనీ పటమటలో గల తమ కార్యాలయంలో https://www.sunsiri.in లో సంప్రదించొచ్చన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా పండ్ల మార్కెట్

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ ఎన్ఎస్‌పి కార్యాలయంలో గత ప్రభుత్వం నిర్మాణం చేసిన పండ్ల మార్కెట్ అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. నందిగామలో పురపాలక సంఘం నిధులతో ప్రభుత్వ నిబంధనలకు నిర్మించిన ఫ్రూట్ మార్కెట్ నిరుపయోగంగా వుంది. నందిగామ ఎన్ఎస్‌పి కార్యాలయం క్వార్టర్స్‌లో పండ్ల మార్కెట్ కోసం రేకులు షెడ్లు మున్సిపాలిటీ నిధులు అడ్డగోలుగా ఖర్చు చేశారు. గత మూడేళ్ళ గా రేకులు షెడ్లు ఖాళీగా వుంటున్నాయి. కొన్ని క్వార్టర్స్ ఆక్రమణకు గురైనా అధికారులు ఖాళీ చేయించలేదు. అప్పట్లో రూ.32 లక్షల రూపాయల వ్యయంతో రేకులు షెడ్లు నిర్మించారు. నిర్మాణంలో నాణ్యత లోపాలు వల్ల రేకులు, పైపులు విరిగి పోతున్నాయి. మున్సిపల్ అధికారులు, ఎన్ఎస్‌పి అధికారుల నుండి తాత్కాలిక అనుమతులు తీసుకుని రేకులు షెడ్లు నిర్మించారు. వీధి వ్యాపారం చేసే వారికి, తోపుడు బండ్లు, బడ్డి కొట్లు చిరు వ్యాపారము చేసే వారికి లాటరీ పద్ధతిన ఈ షాపులు ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. సరిపోయేంత స్థలం లేక, రైతు బజార్ వెనుక భాగంలో వుండటంతో చిరు వ్యాపారులు షాపులు ఏర్పాటు ముందుకు రాలేదు.



నందిగామ లో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిన రేకుల షెడ్లు

చెత్తాచెదారంతో...

ఈ షాపులు అసాంఘిక కార్యక్రమాలకు, మందు బాబులకు అడ్డాగా మారింది. చెత్తా చెదారం, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. దుర్వాసన వెదజల్లుతుంది. పక్క కార్యాలయంలో ఎన్ఎస్‌పి కార్యాలయంలో అధికారులు ఉండవేకపోతున్నారు. అధికారులకు నోటీసులు ఎన్ఎస్ పిక్వార్టర్‌లో ఆక్రమణలు, రేకులు షెడ్లు అవినీతి అక్రమాలపై ఫిర్యాదు చేశారు. ఎన్ఎస్‌పిడి అధికారులు, మున్సిపల్ అధికారులకు నోటీసులు పంపించారు. మున్సిపల్ కమిషనర్‌కు నోటీసులు పంపారు. చర్యలు తీసుకుంటామని తెలిపారు. నందిగామ ఎన్ఎస్‌పి కమిటీ చైర్మన్ వీరబాబు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అందరికీ ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కోడిపందేల బరులు ధ్వంసం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : విజయవాడ సిటీ పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు, నందిగామ సబ్ డివిజన్ డిఎస్పీ ఎబిజి.తిలక్ ఒక స్పెషల్ టీమ్‌ను ఏర్పాటు చేశారు. జగ్గయ్యపేట ఎస్ఐ రాజుని నియమించి జగ్గయ్యపేట సర్కిల్‌లో గల పోలీస్ స్టేషన్లు జగ్గయ్యపేట, చిల్లకల్లు, వత్సవాయి, పెనుగంచిప్రోలు పరిధిలో విస్తృతంగా కోడిపందేలు నిర్వహించే స్థావరాలు పైన తనిఖీ నిర్వహించారు. కోడి పందేలు నిర్వహించే బరులను ధ్వంసం చేసి, నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు.



విద్యుత్ బిల్లులు దహనం

ప్రజాశక్తి - తిరువూరు : సిపిఎం పాత తిరువూరు శాఖ ఆధ్వర్యంలో పెంచిన కరెంటు ఛార్జీలు, స్మార్ట్ మీటర్ విధానాన్ని రద్దు చేయాలని భగత్ సింగ్ కాలనీలో ఆదివారం విద్యుత్ బిల్లులు దహనం చేశారు. పార్టీ పట్టణ కమిటీ సభ్యులు చప్పిడి సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీలు పెంచమని, స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక ప్రజలపై భారాల మోపటం సిగ్గుచేటని, ఇప్పటికైనా విద్యుత్ ఛార్జీలను, స్మార్ట్ మీటర్లను రద్దు చేయకపోతే భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలు చేస్తామని ప్రభుత్వాన్ని సురేష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు బి.అర్.తులసీరావు, శాఖ కార్యదర్శి ఆకుల రవి, సభ్యులు రాము, బాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక,
పదవీ విరమణ, జయంతి, వర్ధంతి,
శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు
అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ
సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల
సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.